ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

3

శనివారం 20 జనవరి 2024



బాపట్ల: ప్యాడిసన్‌పేట జగనన్నకాలనీ గృహాల మధ్య, నిలిచిన నీరు, చిత్తడిగా మారిన రోడ్డు



నాలుగేళ్లుగా.. నత్తనడకన

అసంపూర్తిగా జగనన్న కాలనీలు

- ఇళ్ల లక్ష్యాలు ఘనం.. పురోగతి శూన్యం
- ఎండమావిగానే మౌలిక వసతుల కల్పన
- ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా పనులు
- పేదల ఇంటికి చిల్లిగవ్వ విదిల్చని రాష్ట్ర ప్రభుత్వం
- సమస్యలు పట్టించుకోని అధికారులు.. లబ్ధిదారుల అవస్థలు

పండుగలు పోతున్నాయి..

జగనన్న కాలనీల్లో గృహ ప్రవేశాలకు ముహూర్తాలు మారిపోతున్నాయే కానీ పేదల కల నెరవేరడంలేదు. ఉగాది, దసరా, దీపావళి ఇలా ప్రతి పండక్కి జగనన్న కాలనీల నిర్మాణం విషయంలో ఘనంగా లక్ష్యాలు పెట్టుకోవడం ఆ తర్వాత వాటిని విస్మరించడం ప్రభుత్వానికి రివాజుగా మారింది. ఆరు నెలల క్రితం వరకు జగనన్న ఇళ్ల నిర్మాణం పురోగతి మీద వారాంతపు సమీక్షలతో ప్రభుత్వం హడావిడి చేసేది. ఒక దశలో యంత్రాంగానికి సైతం లక్ష్యాలు విధించి ఒత్తిడికి గురిచేసేది. అలాంటిది ప్రస్తుతం కాలనీల నిర్మాణం పురోగతిని ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది.

రోడ్లు లేవు.. డ్రెయిన్లు లేవు.. తాగునీరు, కరెంటు లేదు.. అయినా కనాకష్టంగా ఇల్లు కట్టుకుంటే రవాణా, ఇతర సౌకర్యాలు లేవు. ఇదీ జిల్లాలోని జగనన్న కాలనీల దుస్థితి. పేరుగొప్ప, ఊరుదిబ్బ అను చందంగా జగనన్నకాలనీలు ఉన్నాయి. ఆర్భాటంగా స్థలాలిచ్చి అధికారులకు లక్ష్యాలు పెట్టి లబ్ధిదారులపై ఒత్తిళ్లు తెచ్చినా కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. పండుగలు వస్తున్నాయి.. పోతున్నాయే కానీ గృహ ప్రవేశాలు ప్రభుత్వం అనుకున్నట్లుగా కావడంలేదు. ఇల్లు కట్టుకోకుంటే స్థలం పోతుం దని.. లేదంటే మరొకరికి ఇచ్చేస్తామని లబ్ధిదారులను బెదిరించి మరీ ఇళ్లను నిర్మించుకునేలా అధికారులు చేసినా పెద్దగా నిర్మాణాలు సాగలేదు. కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు.. ఇల్లు కట్టుకున్న తర్వాత నివాసం ఉండేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించటంలో అధికారులు విఫలమయ్యారు. దీంతో అత్యధిక కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు అరకొరగానే జరిగాయి. ఎన్నికలు సమీ పిస్తున్న నేపథ్యం లో వీలైనన్ని ఎక్కువ ఇళ్లు ఈ నెలాఖరు కల్లా పూర్తి చేయించి ఫిబ్ర వరిలో సామూహిక గృహ ప్రవేశాలు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించినా ఆ పరిస్థితి ఎక్కడా కానరావడంలేదు.



పాతచీరాల జగనన్న కాలనీలో రోడ్ల దుస్థితి



రేపల్లె: జగనన్న కాలనీలో డ్రెయినేజీలు లేకపోవడంతో ఇళ్ళ మధ్యనే చేరిన మురుగునీరు

లబ్ధిదారుల లబోదిబో

వైసీపీ ప్రభుత్వం ఎంతో ఘనంగా చెప్పుకుంటోన్న జగనన్న కాలనీల లేఅవుట్‌లు ఒక్క వర్షానికే నీటి తటాకాలుగా మారిపోతున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో లేఅవుట్లు ఉండటంతో వర్షపు నీరు పోయే మార్గం లేదు. ఎప్పటికైనా భూమిలోకి ఇంకి పోవాల్సిందే తప్ప బయటకు పోయే పరిస్థితి లేదు. లేఅవుట్లలో అంతర్గత రోడ్లు, కాలువలు, విద్యుత్, బోర్ల సౌకర్యాల పేరుతో రూ.కోట్లు వెచ్చించినట్లుగా అధికార వర్గాలు చెబుతున్నా.. ఆ పరిస్థితి ఎక్కడా లేదు. ఓ మోస్తరు వర్షానికి లేఅవుట్లలో లోపాలు బహిర్గతమౌతున్నాయి. వందల లారీలు మట్టిపోసి స్థలాన్ని ఎత్తు పెంచుకుని ఇళ్లు నిర్మించుకున్నా వర్షపు నీరు చుట్టుముట్టేస్తుందని బాధితులు వాపోతున్నారు.



రేపల్లె: జగనన్న కాలనీలో రహదారిపై నిలిచిన నీరు, పెరిగిన పిచ్చిచెట్లు



రేపల్లె: జగనన్న కాలనీలో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు నీరు

(ఆంధ్రజ్యోతి - బాపట్ల బృందం)


కాలనీలు కాదు.. ఊళ్లను నిర్మిస్తున్నామని ప్రభుత్వం జగనన్న కాలనీల ప్రారంభోత్సవంలో ప్రకటించింది. పదుల ఎకరాల్లో లేఅవుట్లు వేసి వందల మందికి స్థలాలు ఇచ్చింది. అయితే నాలుగేళ్ల అవుతున్నా కాలనీలు ఊళ్లుగా మారలేదు కాని చిట్టడవులు, బురదగుంతలను తలపించేలా మారాయి. 'నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేసిన హడావుడి ప్రకటనలకే పరిమితమైందని జగనన్నకాలనీల్లోని క్షేత్రస్థాయి పరిస్థితులు చూస్తే అర్థమవుతోంది. పేదలందరికీ స్థలాలు ఇచ్చి, వారికి ఇళ్లు నిర్మించి ఇస్తానని ముఖ్యమంత్రి చెప్పిన మాట ఆచరణలో నీటి మూటగానే మిగిలిపోయింది. ఇళ్లు నిర్మించి ఇచ్చే విషయంలో ప్రభుత్వం పిల్లిమొగ్గలు వేసి మెలిక పెట్టడంతో లబ్ధిదారులు నిర్మాణాలపై వెనుకంజ వేశారు. పేదల ఇళ్లకు రాష్ట్ర ప్రభుత్వం చిల్లి గవ్వ కూడా విదల్చలేదు.

అరకొర వసతులు.. అప్పులు పాలు

పీఎంఏవై కింద కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.లక్షా 80 వేలను తానిస్తున్నట్లు ప్రచారం చేసుకుంటోంది. లబ్ధిదారుల పేరుతో డ్వాక్రా రుణం రూ.35 వేలు తీసుకుంది. ఈ మొత్తం రూ.2.15 లక్షలతో ఇల్లు కట్టుకోలేక లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. ఫలితంగా జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది. ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి రూ.1.80 లక్షల సాయం చేస్తానని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు ఇది పూర్తిగా అందిన దాఖలాలు లేవు. పైగా మొదట వారు ఖర్చు పెడితే తిరిగి చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పిన మాటలు అమలుకు నోచుకోలేదు. కొందరైతే వచ్చిన స్థలం పోతుందేమోనని తమ వద్ద ఉన్నదంతా ఖర్చు చేసి, అప్పులు తెచ్చి నానా అగచాట్లు పడి నిర్మాణాలు చేపట్టారు. ప్రభుత్వ నిర్వాకం, అధికారుల ఒత్తిడి కారణంగా పేదలకు సొంతింటి కల నెరవేరకపోగా, అప్పులపాలై ఆర్థికంగా చితికి పోతున్నారు. అష్టకష్టాలు పడి ఇళ్లు నిర్మించుకున్న వారు కాలనీల్లో మౌలిక వసతుల లేక అల్లాడిపోతున్నారు. కాల్వలు నిర్మించకపోవడంతో చిన్న పాటి వర్షాలకే కాలనీలు తటాకాలను తలపిస్తున్నాయి. అధ్వాన పారిశుధ్యంతో దోమలు, దుర్వాసనలతో ప్రజలు రోగాల బారిన పడుతున్నా అధికారులకు పట్టడంలేదు. కాలనీల్లో మౌలిక వసతులు లేకపోవడంతో లబ్ధిదారుల ఇక్కట్లకు అంతేలేదు. తాగునీటి సౌకర్యం లేక లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించకపోవటంతో చిత్తడిగా మారిన రోడ్లపై వెళ్ళలేక పడుతున్న కష్టాలు వర్ణాతీతం. రాత్రివేళల్లో పాములు, విషపురుగుల సంచారం ఎక్కువగా ఉంటుందని, పట్టణ ప్రాంతాల నుంచి రవాణా సౌకర్యం కూడా సరిగా లేదని కాలనీవాసులు వాపోతున్నారు. దీంతో ఇళ్లల్లో చేరిన వారు సైతం వాటిని ఖాళీ చేసి వెళ్లిపోతున్న దుస్థితి నెలకొంది.



చీరాల: జగనన్న కాలనీలో అసంపూర్తిగా నిర్మాణాలు



కొల్లూరు: జగనన్న కాలనీలో రహదారిని మూసివేసిన రెల్లి గడ్డి

కాలనీల్లో.. సమస్యల వెల్లువ

బాపట్ల జిల్లాలో మొత్తం 252 లే అవుట్లలో 32,000 ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం తొలుత ప్రకటించింది. అయితే ఇప్పటి వరకు పూర్తయింది కేవలం 12,000 ఇళ్లే. 2023లో ఉగాది నాటికే ఇళ్లను 12,000 వరకు పూర్తి చేయాలని లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుంది. ఆ లక్ష్యం గతేడాది చివరి నాటికి కానీ నెరవేరలేదు. గతేడాది ఉగాదికి ముందు కూడా సంక్రాంతికి ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ దానిని చేరుకోలేదు. ఈ రీతిన ఇళ్ల నిర్మాణం కొనసాగితే మరో రెండేళ్లు గడిచినా ఆ 32,000 ఇళ్ల నిర్మాణం సాధ్యపడదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. బాపట్ల పరిధిలోని ప్యాడిసన్ పేట, మూలపాలెం, బేతనీయ కాలనీ లే అవుట్లలో రహదారులు, మురుగు కాల్వల నిర్మాణం చేపట్టలేదు. అద్దంకి, వేమూరు, రేపల్లె జగనన్నకాలనీలు వర్షాలకు ముంపుబారిన పడుతున్నాయి. బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల్లో స్థలాలు ఇచ్చారు కాని గృహాలు మంజూరు చేయలేదు. దీంతో ఆయా ప్రాంతాలు ముళ్ల చెట్లు పెరిగి చిట్టడవిని తలపిస్తున్నాయి. కొల్లూరు కాలనీలోని ప్లాట్ల వద్దకు వెళ్లేందుకు రోడ్లే లేవు. నిర్మాణాలపై అధికారులు ఒత్తిడితో కొంతమంది సొంత ఖర్చుతో రోడ్డు వేసుకుని ఇళ్ల పనులు పూర్తి చేసుకున్నారు. ప్లాట్ల వద్దకు ఇంటి నిర్మాణ సామగ్రి తీసుకెళ్లే మార్గం లేకపోవడంతో చేసేదిలేక వదిలేసుకున్నారు. పనులు చేపట్టిన సుమారు 400లకు పైగా లబ్ధిదారులకు నోటీసులు ఇచ్చి వారి పట్టాలను హోల్డ్‌లో ఉంచారు. మండల పరిధిలోని తోకలవానిపాలెంలో ఒక్క ఇంటి నిర్మాణం జరగకపోగా లేఅవుట్ మొత్తం చిట్టడవిని తలపిస్తుంది. రేపల్లె 18వవార్డులో 60 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ లే అవుట్‌లో రోడ్లు, డ్రెయినేజీ తదితర వసతులు లేవు. చిన్నపాటి వర్షానికి వర్షపు నీరు రోడ్లపైనే నిలిచి ఉంటోంది. ఇక ఇళ్ల చుట్టూ పిచ్చిమొక్కలు, దోమలతో ప్రజలు అల్లాడుతున్నారు. పూర్తిస్థాయిలో తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయలేదు. చీరాల నియోజకవర్గ పరిధిలో సుమారు 3వేల పైచిలుకు జగనన్న గృహాల్లో పూర్తి అయినవి కొన్ని కాగా అసంపూర్తిగా, అసలు ప్రారంభంకాని నిర్మాణాలు రెండింతలు ఉన్నాయి. చీరాల మండలం పాతచీరాల పరిధిలో చేపట్టిన జగనన్న కాలనీ ప్రాంతంలో ఇటీవల కురిసిన వర్షాలతో చేరిన నీరు నేటికీ అలాగే ఉంది.

ఓటర్ల నిష్పత్తి వ్యత్యాసంపై దృష్టి సారించాలి

ఎలక్ట్రోరల్ అబ్జర్వర్ పోలా భాస్కర్ ఆదేశాలు

బాపట్ల, జనవరి 19: జనాభా సంఖ్యకు, ఓటర్ల నిష్పత్తికి వ్యత్యాసం ఉన్న మండలాలపై ప్రత్యేక దృష్టితో అధికారులు విచారణ చేయాలని ఎలక్ట్రోరల్ అబ్జర్వర్ పోలా భాస్కర్ అధికారులను ఆదేశించారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితాపై ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫాం 8 కింద వచ్చిన దరఖాస్తుల్లో పొరుగు నియోజకవర్గాలు, ఇతర జిల్లాలు, పొరుగు రాష్ట్రాల వారిని నిశితంగా పరిశీలించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వారీగా క్షేత్ర స్థాయి విచారణ అవసరమన్నారు. శాశ్వత వలసలు గుర్తించాలని, నివాసం ఉండేవారిని నిర్ధారించాలని చెప్పారు. లాగిన్స్, డిజిటల్ కీ వినియోగంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటర్ల జాబితాపై ఫిర్యాదులు అందిన వెంటనే తగిన ఆధారాలు చూపాలని ఫిర్యాదు చేసిన వారికి నోటీసులు ఇవ్వాలని తెలిపారు. బీఎల్‌వోల నివేదికలను అధికారులు సమగ్రంగా పరిశీలించాలన్నారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా పరిశీలన ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. సమావేశంలో జేసీ శ్రీధర్, డీఆర్‌వో పి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌వోలతో సమావేశమైన ఎలక్ట్రోరల్ అబ్జర్వర్ పోలా భాస్కర్, కలెక్టర్ పి.రంజిత్‌బాషా

15 మంది ఎస్‌ఐల బదిలీలు

బాపట్ల, జనవరి 19: జిల్లాలో 15 మంది ఎస్‌ఐల బదిలీకు ఎస్పీ వకుల్ జిందాల్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారి వివరాలను ఆయన శుక్రవారం ప్రకటించారు.

పేరు	మండలం	బదిలీ
పి.సురేష్	అమర్తలూరు	సంతమాగులూరు
ఎం.వి.శివకుమార్	సంతమాగులూరు	వీఆర్
పి.నాగశివరెడ్డి	మేదరమెట్ల	బల్లికురవ
వి.వేమన	బల్లికురవ	వీఆర్
జివి.చౌదరి	కొరిశపాడు	వీఆర్
ఎ.చంద్రశేఖర్	భట్టిప్రోలు	మేదరమెట్ల
జె.నాగరాజు	వేమూరు	అద్దంకి
ఎస్.రాజశేఖర్	చందోలు	వేమూరు
టి.అనీల్‌కుమార్	వీఆర్	చందోలు
జి.నవీన్‌కుమార్	వీఆర్	వెదుళ్లపల్లి
ఎం.అనిత	వెదుళ్లపల్లి	వీఆర్
పి.జనార్ధన్	ఈపూరుపాలెం	కర్లపాలెం
ఎం.శివయ్య	కర్లపాలెం	వీఆర్
ఎస్‌కె.అబ్దుల్‌రజాక్	వీఆర్	బాపట్ల టౌన్
డి.రత్నకుమారి	వీఆర్	అద్దంకి



బస్సులు లేకపోవటంతో నిర్మానుషంగా రేపల్లె బస్టాండ్

బస్సులు లేక.. ఇక్కట్లు

- బస్టాండ్లలో ప్రయాణికుల పడిగాపులు
- అరకొర సర్వీసులతో ప్రయాణానికి పాట్లు
- సీఎం సభకు జిల్లా నుంచి ఆర్టీసీ బస్సులు

బాపట్ల, రేపల్లె, జనవరి 19: విజయవాడలో శుక్రవారం సీఎం జగన్‌మోహనరెడ్డి సభ ఆర్టీసీ ప్రయాణికులకు చుక్కలు చూపించింది. జన సమీకరణకు ఎక్కడికక్కడ డిపోల నుంచి బస్సులను కేటాయించారు. దీంతో రోజువారీ, పండుగ సెలవుల అనంతరం సొంతూళ్లకు వెళ్లే వారు బస్సుల కొరతతో ఇక్కట్లు పడ్డారు. డిపోలు, బస్టాండ్లలో బస్సుల కోసం గంటల కొద్దీ పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఉన్న అరకొర బస్సులు పెద్దసంఖ్యలో ప్రయాణికులతో కిటకిటలాడాయి. బస్సు ఎక్కేందుకు తోపులాటకు దిగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. సంక్రాంతి సెలవుల అనంతరం ప్రయాణికుల రద్దీ ఉంటుందని తెలిసి అత్యధికంగా బస్సులను సీఎం సభకు కేటాయించిన ఆర్టీసీ తీరుపై ప్రయాణికులు మండిపడ్డారు. చంటి పిల్లలతో తల్లులు, వృద్ధులు పడిన అవస్థలు చెప్పనలవికావు. బస్సులను సీఎం సభకు ఏర్పాటు చేసి తమను ఇబ్బందులకు గురిచేయడం దారుణమని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాపట్ల డిపో నుంచి 38 బస్సులను తరలించడంతో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రయాణికులు నానా పాట్లు పడ్డారు. సమయానికి బస్సులు లేక ప్ర యాణికులు ఆటోలను, కార్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే అవకా శంగా ప్రైవేట్ వాహనదారులు అధిక చార్జీలు వసూలు చేశారు. రేపల్లె డిపో పరిధిలోని అన్ని బస్సులతో పాటు కాకినాడ నుంచి కూడా తెప్పించిన బస్సులను విజయవాడ సీఎం సభకు పంపారు. విషయం తెలియక బస్టాండ్‌కు వచ్చిన ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది.



రేపల్లె బస్టాండ్లలో ప్రయాణికుల పడిగాపులు



బాపట్లలో బస్సుల కోసం వేచి చూస్తూ..



- కమిషనర్ రామచంద్రారెడ్డి, మేరిబాబు మధ్య వాగ్వాదం

కమిషనర్ వర్సెస్ వైసీపీ నేత

- ఆక్రమణలపై నోటీసులతో మేరిబాబు ఆగ్రహం
- మున్సిపల్ కార్యాలయంలో వాగ్వాదం.. ఆందోళన
- సీఎంవోకు ఫోన్‌తో చర్యలు ఉండవని సర్దిచెప్పిన కమిషనర్

చీరాల, జనవరి 19: మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డిపై శుక్రవారం వైసీపీ యువజన నేత యాతం మేరీబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తి కార్యాలయంలోనే ఆందోళన చేపట్టారు. స్థానిక 7వ వార్డులో ఆక్రమణలు, రోడ్డు నిర్మాణానికి సంబంధించి చేపట్టిన చర్యలు అటు కమిషనర్, ఇటు ఆ వార్డు అధికారపార్టీ ప్రతినిధి మధ్య తీవ్ర వాగ్వాదానికి దారి తీసింది. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయం అందుకు వేదికగా నిలిచింది. ఇందుకు సంబంధించిన వివరాలు.. వార్డులో ఆక్రమణల తొలగింపునకు సంబంధించి స్పందనకు అర్జీ వచ్చింది. ఈ నేపథ్యంలో కమిషనర్ రామచంద్రారెడ్డి చర్యలు చేపట్టి ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చారు. ఆ చర్యలను ఆపాలని కొద్ది రోజులుగా మేరీబాబు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఈక్రమంలో శుక్రవారం నోటీసులు అందుకున్న మహిళతో పాటు మరికొందరు అనుచరులతో కమిషనర్ వద్దకు ఆయన వచ్చి ఆక్రమణల తొలగింపు, రోడ్డు నిర్మాణానికి సంబంధించి సమాచారం ఇవ్వకుండా ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఇలాగే అన్ని వార్డుల్లో చేస్తున్నారా, కౌన్సిల్ ఆమోదం లేకుండా ఎలా చేస్తారని మేరీబాబు ప్రశ్నించారు. తమకు వచ్చిన అర్జీల నేపథ్యంలో అభివృద్ధి పనులపై నిర్ణయం తీసుకునే అధికారాన్ని, స్పందన అర్జీల పరిష్కారంపై కమిషనర్ వివరించారు. దీంతో మేరీబాబు సీఎంవోకు ఫోన్ చేసి కమిషనర్ తమ మాట వినడం లేదని ఎమ్మెల్యే బలరాం, వైసీపీ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్‌కు నష్టం చేకూర్చేలా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. గతంలో తమ బిల్డింగ్ పడగొట్టారని, ప్రస్తుతం తన వార్డులో కక్షపూరితంగా ఎవరో చెప్తే నోటీసులు ఇచ్చారని తెలిపారు. వార్డులో కోటి పైచిలుకు నిధులు మంజూరైతే ఒక్క రూపాయి పని కూడా జరగలేదన్నారు. అనంతరం కార్యాలయం కారిడార్‌లో ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జ్ టీపీఎం లక్ష్మి ద్వారా నోటీసులపై చర్యలుండవని చెప్పించినా వారు ఆందోళన విరమించలేదు. తర్వాత కమిషనర్ వచ్చి నోటీసులపై చర్యలు ఉండవని సర్దిచెప్పటంతో ఆందోళన విరమించారు. ఈ విధంగా బెదిరిస్తే ఇక ఉద్యోగాలు ఎలా చేయగలమని పలువురు ఆవేదన చెందారు.

కమిషనర్ బదిలీ అయ్యే అవకాశం

ఎన్నికల కమిషన్ నిబంధనల నేపథ్యంలో అధికారులను సొంత జిల్లా నుంచి బదిలీ చేయడం అనివార్యం. ఆక్రమంలో కమిషనర్ రామచంద్రారెడ్డిది బేస్తవారిపేట. దీంతో ఆయన ఉమ్మడి ప్రకాశంలో సొంత జిల్లాకు చెందిన అధికారి. దీంతో ఆయన ఈ నెల 22 తర్వాత ఎప్పుడైనా బదిలీ కావచ్చు. ఈక్రమంలో ఆయన ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని అటు రాజకీయ వర్గాల్లోను, ఇటు జనాల్లోను చర్చ జరుగుతోంది.



తుళ్లూరు రైతు ధర్నా శిబిరం నుంచి నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

మోసపూరిత పాలనకు చరమగీతం తప్పదు

● పాలకుల ప్రయోజనం కోసమే మూడు ముక్కలాట

● 1494 వ రోజుకు చేరిన రైతుల ఆందోళనలు

తుళ్లూరు జనవరి 19: మోసపూరిత పాలనకు చరమగీతం తప్పదని రాజధాని అమరావతి నిర్మాణానికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు శుక్రవారం నాటికి 1494వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు ధర్నా శిబిరాల నుంచి మాట్లాడుతూ అమరావతి ప్రజా రాజధాని అని స్పష్టం చేశారు. మూడు రాజధానులనేది వైసీపీ పాలకుల ప్రయోజనం కోసమేనన్నారు. అమరావతి ప్రాంతం అటు శ్రీకాకుళానికి, ఇటు అనంతపురానికి సమదూరంలో ఉన్నటువంటి ప్రదేశమన్నారు. అన్నీ సౌకర్యాలతో ఏర్పాటు కాబోతున్న అమరావతిని సీఎం జగన్‌రెడ్డి మూడు ముక్కల ఆటతో నాశనం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. అమరావతిని అభివృద్ధి చేయాలని ఉన్నత న్యాయస్థానం సూచించినా లెక్కలేకుండా వైసీపీ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. పాలకులు మారినంత మాత్రం రాజధాని మారదన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమంలో భాగంగా దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో ఆందోళనలు కొనసాగాయి.

కోర్టుకు జగన్ ఎందుకు వెళ్ళటం లేదు?



● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జనవరి 19: కోడి కత్తి కేసులో సీఎం జగన్ ఎందుకు కోర్టుకు హాజరు కావటం లేదని?, కోర్టులంటే జగన్‌కు అంత భయమెందుకో?, ప్రజలకైనా సమాధానం చెప్పాలని మాజీ మంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు డిమాండ్ చేశారు. గత ఐదు సంవత్సరాలుగా జైల్లో మగ్గిపోతున్న ఒక నిరుపేద దళిత యువకుడు శ్రీను కేసులో జగన్ తీరుపైనే అందరికీ అనుమానాలు కలుగుతున్నాయని, కనీసం అతడికి బెయిల్ కూడా రాకుండా అడ్డు పడుతూ జగన్ ప్రజల అనుమానాలను మరింత నిజం చేస్తున్నారని అభిప్రాయం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని తన నివాస గృహంలో ప్రత్తిపాటి మీడియాతో మాట్లాడుతూ నాడు విశాఖ విమానాశ్రయంలో జరిగిన ఘటనలో ఎలాంటి రాజకీయ కోణం లేదని, జగన్ పై అభిమానంతోనే శ్రీను ఆపని చేసినట్టు స్వయానా జాతీయ దర్యాప్తు సంస్థే తేల్చినా మరింత లోతైన విచారణ కోరుతూ జగన్ కేసును సాగ దీయటం ఆయన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం కాదా? అని ప్రశ్నించారు. నాడు ఎన్నికల ముందు సొంత బాబాయి వైఎస్ వివేకా హత్య కేసు, కోడి కత్తి కేసు ఘటనలను రాజకీయ ప్రయోజనాలకు వాడుకున్నారని టీడీపీ అధినేత చంద్రబాబు పై లేని పోని అభాండాలు వేశారని, ఈ రెండు కేసుల్లో సీబీఐ, ఎన్ఐఏలు వాస్తవాలు వెల్లడించాయని అన్నారు.

భూహక్కుల చట్టం రైతులకు నష్టదాయకం

● రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య

తెనాలి రూరల్, జనవరి 19: ప్రభుత్వం దొడ్డిదారిన తెచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో ప్రజలకు తీవ్ర నష్టంజరగనున్నదని, ఆ చట్టం రద్దయ్యేంతవరకూ తామంతా పోరాడతామని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య అన్నారు. పట్టణంలోని చెంచుపేట ప్రజాసంఘాల కార్యాలయంలో శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో భూ హక్కుల చట్టం - రైతులకు నష్టకరం అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యవక్తగా పాల్గొన్న కృష్ణయ్య మాట్లాడుతూ పెట్టుబడి దారులకు వారు కోరుకున్న రీతిలో భూములను కట్టబెట్టేందుకే ఈ చట్టాన్ని తెచ్చిందని ఆరోపించారు. రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉంటే వారి కబంధహస్తాల్లో భూమి హక్కు ఉండే విధంగా తెచ్చిన చట్టంతో వారసత్వంగా ప్రజలకు వస్తున్న భూములపై హక్కును కోల్పోయే ప్రమాదం పొంచి ఉందని అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వేణుగోపాల్ మాట్లాడుతూ ల్యాండ్ టైట్లింగ్ యాక్టు ద్వారా భూ సంబంధిత వివాదాలను ట్రిబ్యునల్ ద్వారా రెండేళ్ల కాలపరిమితిలో పరిష్కరిస్తామని చెబుతున్నారని అదెలా సాధ్యమని ప్రశ్నించారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి, తెలుగు రైతు నాయకులు ఈదర వెంకటపూర్ణచంద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ చందుసాంబశివుడు తదితరులు ప్రసంగించారు. సీనియర్ న్యాయవాది ఎన్‌వి. మహేశ్వరరావు, కెవి సత్యనారాయణ, కె.వెంకటేశ్వరరావు, కె.పూర్ణచంద్రరావు, వై. బ్రహ్మేశ్వరరావు, ఆళ్ళ సాండిరెడ్డి, టి.వెంకటేశ్వరరావు, ఎన్.రాజ్యలక్ష్మి, ఎం.సాంబశివరావు, డి.సాంబశివరావు, అమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య

దళితుల అభ్యున్నతిని అడ్డుకుంది జగనే

● ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్(చేబ్రోలు), జనవరి 19: మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్థాయిని తగ్గించే విధంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి వ్యవహరిస్తున్నారన్ని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ధ్వజమెత్తారు. చేబ్రోలులో శుక్రవారం టీడీపీ, జనసేన పార్టీల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో నరేంద్ర మాట్లాడుతూ 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటులో ఆయన పేరుతో సమానంగా జగన్‌రెడ్డి తన పేరు పెట్టుకోవటం మంచిది కాదన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం సబ్‌ప్లాన్‌ను రూపొందించి వారికి ప్రత్యేక నిధులను కేటాయించారని గుర్తు చేశారు. ఆ సబ్‌ప్లాన్ నిధులను దుర్వినియోగం చేసి కార్పొరేషన్లను నిర్వీర్యం చేసిన ఘనత జగన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. విదేశీ విద్య పథకానికి అంబేద్కర్ పేరును తొలగించి జగన్‌రెడ్డి తన పేరు పెట్టుకొని మహనీయుడిని అవమానించాడని ఆరోపించారు. రాష్ట్రంలో డాక్టర్ సుధాకర్ దగ్గర నుంచి 300లకు పైగా దాడులు దళితులపై జరిగాయని ఆరోపించారు. 27 పథకాలు దళితులకు నిలిపివేసి వారి అభ్యున్నతిని అడ్డుకున్నది జగన్ కాదా అన్ని ప్రశ్నించారు. పొన్నూరు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయ బాబు మాట్లాడుతూ వైసీపీ పాలనలో బడుగు బలహీన వర్గాలు, దళితులపై అకృత్యాలు పెరిగిపోయాని ఆరోపించారు. కులానికి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్లను నియమించటమే కానీ, కార్యాలయాలు కానీ, నిధులు కానీ విడుదల చేయలేదన్నారు. రైతులను ఆదుకోలేని దౌర్భాగ్య పరిస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందన్నారు. సమావేశంలో నియోజకవర్గ స్థాయి పొన్నూరు, చేబ్రోలు, పెదకాకాని మండలాల టీడీపీ, జనసేన సమన్వయ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

వేమన పద్యాలకు కాలదోషం లేదు

● కొండవీడులో ఘనంగా యోగి వేమన జయంతి వేడుకలు

కొండవీడుకోట(యడ్లపాడు), జనవరి19: వేమన పద్య రూపంలో చెప్పిన హితవచనాలకు కాలదోషం లేదని, భూమ్యాకాశాలు ఉన్నంతవరకూ దిక్సూచిగా నిలుస్తాయని ప్రముఖ గ్రంథ సంపాదకుడు, ఉపాధ్యాయుడు మోదుగుల రవికృష్ణ అన్నారు. యడ్లపాడు మండలంలోని చారిత్రక కొండవీడుకోటలో ప్రజాకవి యోగి వేమన జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పల్నాడుజిల్లా అటవీశాఖాధికారి ఎన్.రామచంద్రరావు వేమన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రవికృష్ణ మాట్లాడుతూ యోగి వేమన గొప్ప సంఘ సంస్కర్త అన్నారు. కొండవీడుకోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాహిత్య అభిలాషులు ఇందుకూరి వెంకటరెడ్డి, రేంజ్ అధికారి వెంకటరమణమ్మ, కొండవీడు బీట్ అధికారి పురుషోత్తమరాజు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వేమన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న జిల్లా అటవీశాఖాధికారి రామచంద్రరావు

సీఐడీ విచారణకు తెలుగు యువత నేతలు

గుంటూరు, జనవరి 19: దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ పెట్టిన కేసులో రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు షేక్ ఫిరోజ్, ఐ టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండి శివ కేశవ శుక్రవారం సీఐడీ విచారణకు హాజరయ్యారు. మైనార్టీ వర్గానికి చెందిన తనను పవిత్ర శుక్రవారం నమాజ్ కూడా చదువుకోనీయకుండా విచారణ పేరుతో మానసిక వేధింపులకు గురిచేశారని ఫిరోజ్ ఆవేదన వ్యక్తం చేశారు. సుదీర్ఘ విచారణ అనంతరం 30 నుంచి 40 ప్రశ్నలు వేసి తమ మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు జప్తు చేసారని వాపోయారు. తమను ఈ నెల 30న రావాలని మరో నోటీసు ఇచ్చారని తెలిపారు. ఇద్దరితో పాటు న్యాయవాదులు మాజీ పి.పి శ్రీరామ్ రాజీవ్ ఆనంద్, హైకోర్టు న్యాయవాది పొన్నం రవీంద్రబాబు విచారణకు హాజరయ్యారు. గుంటూరు పశ్చిమ టీడీపీ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర, గుంటూరు జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ, రాష్ట్ర మైనారిటీ నేతలు హాస్సేన్, బాజీ మాస్టర్, షేక్ నాయబ్ రసూల్, షేక్ రషీద్, ఐ టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బేతమల మనిరత్నం, కోసూరి సతీష్ గౌడ్, మల్లెంపూడి శ్రీనివాస రావు, కొల్లి నాగుల్ షేక్ సుభాని, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షులు గుత్తికొండ కిరణ్ యాదవ్, తెలుగుయువత నాయకులు షేక్ రఫీ, చిక్కాల శివరామ కృష్ణ, శొంఠినేని అనిల్, శేషాద్రి సాంబశివరావు, గాలి ఉపేంద్ర, బుల్లా కుమార్ బాబు, కళ్యాణ్ తదితరులు వారికి సంఘీబావం తెలిపారు.



సీఐడీ విచారణకు వెళుతున్న తెలుగుయువత నాయకులు ఫిరోజ్, శివకేశవలతో రావిపాటి సాయి, న్యాయవాదులు

గాజువాకలో గుంటూరు యువకుడి ఆత్మహత్య

విశాఖపట్నం, జనవరి 19: విశాఖ నగరం గాజువాకలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో యువకుడు శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలావున్నాయి....గుంటూరు నగరానికి చెందిన ఎస్.సాయికృష్ణ (26) గాజువాకలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో పనిచేసుకుంటూ అక్కడే ఉంటున్నాడు. దీంతో పాటు ఫుడ్ డెలివరీ బాయ్‌గా కూడా పనిచేస్తున్నాడు. కాగా సాయికృష్ణ తండ్రి ఇటీవల గాజువాక వచ్చి సంక్రాంతికి ఇంటికి రావాలని చెప్పి వెళ్లిపోయాడు. అయినప్పటికీ సాయికృష్ణ స్వగ్రామం వెళ్లలేదు. శనివారం ఉదయం హాస్టల్‌లో అతడి గది తలుపు ఎంతకీ తీయకపోవడంతో అనుమానం వచ్చిన సిబ్బంది తలుపు తెరచి చూడగా, ఫ్యాన్ హుక్కుకు ఉరి వేసుకుని ఉన్నాడు. దీంతో వారు వెంటనే గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలంలో వివరాలు సేకరించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

● ఏపీఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ త్రివిక్రమ వర్మ

పెదకాకాని, జనవరి19: క్రమం తప్పకుండా రోజు క్రీడలు ఆడటం వల్ల మానసిక ఉల్లాసం, దేహదారుఢ్యం కలుగుతుందని ఏపీ ఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సీఎం త్రివిక్రమ వర్మ తెలిపారు. సీఎం జగన్ ప్రతిపాదించిన ఆడుదాం ఆంధ్రాలో భాగంగా శుక్రవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏపీఎస్పీఎఫ్ స్పోర్ట్స్ మీట్- 2024ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా త్రివిక్రమవర్మ మాట్లాడుతూ ఏపీఎస్పీఎఫ్‌లో రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలను జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. విజయవాడ, రాజమండ్రి, రాయలసీమ జోన్‌ల నుంచి 100 మంది ఏపీఎస్ఎఫ్ సిబ్బంది హాజరయ్యారు. రెండు రోజుల పాటు జరిగే రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలలో ఎస్పీఎఫ్ ఐజీ బి.వి.రామిరెడ్డి, ఎస్పీఎఫ్ విజయవాడ జోన్ కమాండెంట్ ఎం.శంకర్రావు, అసిస్టెంట్ కమాండెంట్ కె.కృష్ణమూర్తి, కమాండెంట్ కెవీఎస్ గుప్త, అసిస్టెంట్ కమాండెంట్‌లు మల్లికార్జున్‌రావు, డి.శంకర్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె.కుమార్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీజీ త్రివిక్రమ వర్మ

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



భానుప్రకాష్ మృతదేహం

యడ్లపాడు, జనవరి 19: ముందు వెళుతున్న కారును వెనుక నుంచి ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పదహారో నంబరు జాతీయ రహదారిపై యడ్లపాడు వద్ద గురువారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రేపల్లెకు చెందిన సుఖవాసి భానుప్రకాష్(43), సాంబశివరావు, హేమంత్‌కుమార్, విజయవాడకు చెందిన శ్రీనాథ్‌లు విజయవాడ నుంచి తిమ్మాపురంలోని బంధువు ఇంటికి కారులో బయలుదేరారు. యడ్లపాడు ఎస్ఎస్ఎల్ వద్దకు రాగానే కారును వెనుక నుంచి ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టింది. కారు వెనుక సీటులో కూర్చున్న భానుప్రకాష్, హేమకుమార్‌లు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని 108వాహనంలో చిలకలూరిపేటలోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో భానుప్రకాష్ మృతిచెందాడు. మృతునికి భార్య రాధిక, ఒక కుమార్తె ఉన్నారు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు దిగుతూ ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి మృతి



పాతూరి రవిచంద్ర (ఫైల్)

పిడుగురాళ్ళ, జనవరి 19: రైల్వేస్టేషన్‌లో ప్రమాదవశాత్తు ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి మృతి చెందిన ఘటన శుక్రవారం పిడుగురాళ్ల రైల్వేస్టేషన్‌లో జరిగింది. ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి పాతూరి రవిచంద్ర(33) కుటుంబం సంక్రాంతి పండుగకు పిడుగురాళ్ల వచ్చింది. వారికోసం రవిచంద్ర హైదరాబాద్ నుంచి పిడుగురాళ్ల వచ్చి రైలు దిగుతుండగా జారిపడి తీవ్రగాయాలు అయ్యాయి. ప్రథమ చికిత్స అనంతరం గుంటూరు తరలిస్తుండగా మార్గమధ్యంలో రవిచంద్ర మృతి చెందాడు. మృతునికి భార్య, ఇరువురు పిల్లలు వున్నారు.


అత్యాచారం కేసులో ఉపాధ్యాయుడు అరెస్టు

పిడుగురాళ్ల, జనవరి 19: బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఉపాధ్యాయుడు షేక్ ఆదాంషఫీవుల్లాను శుక్రవారం పిడుగురాళ్ల పోలీసులు అరెస్టు చేశారు. మైనర్‌పై జరిగిన ఘటనను దళిత సంఘాలు, ప్రజాసంఘాల నేతలు తీవ్రంగా ఖండిస్తూ నిందితుడిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

బైక్ కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య

బాపట్లరూరల్, జనవరి 19: పురుగుల మందు తాగి యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. బాపట్లరూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని కొండుభొట్లవారిపాలెం గ్రామానికి చెందిన ఎస్.హేమంత్ (22) అనే యువకుడు తమ తల్లిదండ్రులను బైక్ కొనుక్కోవాలని డబ్బులు అడగగా వారు నిరాకరించటంతో మనస్థాపానికి గురై పురుగుల మందు తాగాడు. వెంటనే ఆ యువకుడిని కుటుంబ సభ్యులు బాపట్ల ఏరియా వైద్యశాలకు తీసుకొచ్చారు. మెరుగైన వైద్యం కోసం పొన్నూరు తరలించగా మార్గ మధ్యంలో యువకుడు మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ పోలీసులు తెలిపారు.

స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



వేణుబాబు మృతదేహం

ప్రత్తిపాడు, జనవరి 19: స్కూలు బస్సు ఢీ కొని ద్విచక్ర వాహనదారుడు మరణించిన ఘటన ప్రత్తిపాడు మండల పరిధిలోని తిక్కిరెడ్డిపాలెం వద్ద శుక్రవారం జరిగింది. ప్రత్తిపాడు పోలీసుల కథనం ప్రకారం బాపట్ల జిల్లా పర్చూరు మండలం నూతలపాడు గ్రామానికి చెందిన వెల్లటూరి వేణుబాబు (38), గణేష్ మణికంఠారెడ్డిలు ద్విచక్రవాహనంపై గుంటూరు వైపు వెళుతున్నారు. అయితే తిక్కిరెడ్డిపాలెం వద్ద ముందు వెళుతున్న కారును ఓవర్‌టేక్ చేస్తుండగా గుంటూరు వైపు నుంచి వస్తున్న స్కూల్ బస్ వీరిని ఢీ కొంది. దీంతో ముందు ఉన్న వేణుబాబు అక్కడికక్కడే మరణించగా, వెనుక ఉన్న గణేష్‌మణికంఠారెడ్డికి కాళ్లు చేతులు విరిగి పోయాయి. వెంటనే ఇతన్ని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు ప్రత్తిపాడు ఎస్ఐ రవీంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ హయాంలో దళితులకు అన్యాయమే

● మాజీ ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల, జనవరి 19: రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక 6 వేల మందికి పైగా దళితులపై ముఖ్యమంత్రి దాడులు చేయించారని గురజాల మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నేత యరపతినేని శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 188 మంది దళితులను హత్యలు చేశారని, రోజు ఇద్దరు ముగ్గురు దళితులపై దాడులు, ఆరుగురిపై హత్యాయత్నాలు, వారానికి ముగ్గురు దళిత మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయని ఆరోపించారు. దళితులకు రాజ్యాంగ బద్ధంగా అందాల్సిన 27 సంక్షేమ పథకాలను రద్దు చేసిన జగన్ ఏమి ఉద్ధరించాడని అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరణ చేస్తున్నాడన్నారు. కొవిడ్ సమయంలో మాస్క్ అడిగిన దళిత వైద్యుడు సుధాకర్‌ను దారుణంగా హత్యచేయడమే కాకుండా మరో దళితుడిని చంపి డోర్ డెలివరీ చేసిన ఘనత వైసీపీ నేతలదేనన్నారు. టీడీపీ హయాంలో 4 లక్షల మంది దళిత సోదరులకు ఉపాధి కల్పించిన ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసి విదేశీ విద్యను దూరం చేశారని అన్నారు. దళితులు ఆత్మగౌరవంతో సగర్వంగా బతికేందుకు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ల్యాండ్ పర్చేజింగ్ స్కీమ్‌ను తీసుకొస్తే జగన్ ఆ పథకాన్ని రద్దు చేశాడన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా వున్న 50 వేల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయకపోగా చంద్రబాబునాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ అందుబాటులోకి తీసుకొస్తే జగన్ దానిని కూడా పక్కన పెట్టేశాడన్నారు. ఎస్సీ, ఎస్టీ చెల్లెమ్మల వివాహానికి వైఎస్ఆర్ పెళ్లికానుక లక్ష రూపాయలు ఇస్తానని మేనిఫెస్టోలో చెప్పి ఒక్కరికి ఇచ్చిన పాపాన పోలేదని అన్నారు. కోడికత్తి డ్రామాలో దళితబిడ్డ శ్రీనివాసును, అయేషామీరా కేసులో సత్యంబాబును ఏళ్లతరబడి జైలుపాలు చేశారన్నారు. జంగారెడ్డిగూడెంలో జరిగిన కల్తీమద్యం మృతులలో 12 మంది దళితులు మృతిచెందారన్నారు. అక్రమ ఇసుక రావాణాను ప్రశ్నించిన వరప్రసాద్‌కు గుండుగీయించి మాస్క్ పెట్టుకోలేదని చీరాలకు చెందిన దళిత యువకుడు కిరణ్‌ను పోలీసులు కొట్టి చంపారని, మెజిస్ట్రేట్‌గా పనిచేస్తున్న రామకృష్ణ సోదరుడు రామచంద్రపై దాడి చేయడమే కాకుండా పులివెందులలో దళిత మహిళ పై అత్యాచారం చేశారన్నారు. ఆర్థిక నేరగాళ్లు అంతా వైసీపీలోనే వున్నారని యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు.

దళిత ద్రోహి సీఎం జగన్

● మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



మాట్లాడుతున్న పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు

వినుకొండ, జనవరి 19: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విదేశీ విద్య పథకానికి పేరు మార్చి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దళితులను అగౌరవపరిచారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో 125 వేల అడుగులకు తొక్కి 125 అడుగుల విగ్రహం పెడితే దళితులకు మీరు చేసిన పాపాలు పోతాయా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దళితులను గౌరవిస్తూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరుపై విదేశీ విద్యను ప్రవేశపెట్టి 10 నుంచి 15 లక్షల మందికి పైగా విద్యార్థులకు విదేశీ విద్యను అందించడం జరిగిందన్నారు. నాలుగేళ్ల వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు జగన్‌రెడ్డి ప్రభుత్వం ఎందుకు విదేశాలకు పంపలేదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా 6వేల మంది దళితులపై దాడికి పాల్పడి 180మంది దళితులను హతమార్చిన దళిత ద్రోహి జగన్ అని అన్నారు. దళితులపై ప్రేమ ఉంటే బ్లాక్ లాక్ పోస్టులు ఎందుకు భర్తీ చేయలేదని ఆయన ప్రశ్నించారు. దళితవాడలకు 200 యూనిట్ల లోపు కరెంటు చంద్రబాబునాయుడు ప్రకటిస్తే జగన్ ప్రభుత్వం ఉచిత కరెంటు ఎత్తేసి దళితుల ముక్కు పిండి బిల్లులు వసూలు చేశారన్నారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం పెట్టినంత మాత్రాన నీవు చేసిన పాపాలు దళితులు మరచిపోరని, విగ్రహాన్ని ఆవిష్కరించే నైతిక హక్కు మీకు లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్వార్థ రాజకీయాలతో పచ్చగా ఉన్న పల్లెల్లో గొడవలు పెట్టి ప్రజల మధ్య చిచ్చు రేపుతున్నారన్నారు. బొల్లా అవినీతిని ప్రశ్నించినవారిపై దాడులు, హత్యాయత్నాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో బ్రహ్మనాయుడు అహంకారానికి, అవినీతి, అక్రమాలకు ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో ఐఏఎస్ అకాడమి చైర్మన్ పారా లక్ష్మయ్య, డీఎల్‌డీఏ చైర్మన్ లగడపాటి వెంకట్రావు, నియోజకవర్గ పరిశీలకుడు మానుకొండ శివప్రసాద్, బచ్చు అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ పేరు పలికే అర్హత జగన్‌కు లేదు

● మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్

బెల్లంకొండ, జనవరి 19: రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ పేరును పలకటానికి కూడా ఈ రాష్ట్ర ముఖ్యమంత్రికి ఏ మాత్రం అర్హత లేద ని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మహోన్నతమైన వ్యక్తి బాబా సాహెబ్ అంబేద్కర్ అన్నారు. అలాంటి వ్యక్తి పేరుతో గతంలో తెలుగుదేశం పార్టీ అంబేద్కర్ విదేశీ విద్య అని పేరు పెడితే ప్రస్తుతం ఆ పేరును తొలగించి వైఎస్ విద్య అని పేరు పెట్టారని అన్నారు. అటువంటి వ్యక్తి మళ్ళీ అంబేద్కర్ పేరు చెప్పి విగ్రహావిష్కరణ అంటూ దళితుల ఓట్లను దండు కోవటం కోసం కుట్ర జరుగుతుం దన్నారు. నిజంగా ముఖ్యమంత్రికి అంబేద్కర్ పై ప్రేమ ఉంటే తక్షణమే వైఎస్ఆర్ విదేశీవిద్య పేరు మార్చి అంబేద్కర్ విదేశీ విద్యను పేరును కొనసా గించాలని డిమాండ్ చేశారు. అణగారిన వర్గాల కోసం గత ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్, ఎస్సీ కార్పొరేషన్ లోన్‌లను ప్రదేశ పెడితే ప్రస్తుత ప్రభుత్వం వాటిని రద్దు చేసి మోసం చేశారని విమర్శించారు. దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి దళితుల పాలిట శాపంగా మారారని విమర్శించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.35 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119, 130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

గుంటూరు మిర్చియార్డులో ధరలు ఇలా...

గుంటూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 80,758 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 90,534 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 41,325 టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఇలా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	21000
నెంబరు. 5	10000	19000
273	12000	16500
341	10000	19000
4884	11500	16000
సూపర్ 10	15000	15000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20500
బ్యాడిగి	9000	19000
దేవనూరుడీలక్స్	8000	20000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
తెల్లకాయలు	5000	13000
ఏసీ కామన్ వెరైటీ		
334	--	--
నెంబరు. 5	--	--
273	--	--
341	14000	15200
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	16500	18500
బ్యాడిగి	11000	18000
దేవనూరుడీలక్స్	--	--
తెల్లకాయలు	6000	12500

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



యోగి వేమన పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా తదితర అధికారులు

తత్వవేత్తగా పేరుగాంచిన యోగి వేమన : కలెక్టర్

బాపట్ల, జనవరి 19 : సరళమైన తెలుగుభాషలోనే భారతీయ తత్వవేత్తగా యోగి వేమన గొప్ప పేరుగాంచారని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వేమన జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులతో కలిసి వేమన పటానికి కలెక్టర్ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఆయన రచనలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో పి.వెంకటరమణ, బీసీ సంక్షేమశాఖా అధికారి డాక్టర్ బి.అర్జునరావు, ఏవో కె.గోపికృష్ణ, పర్యవేక్షకులు జి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళ్ళం హరినాథ్‌రెడ్డి తదితరులు

● బాపట్లటౌన్, జనవరి 19 : తెలుగు భాషకు ఎనలేని సేవ చేసి తెలుగు ప్రజల గుండెలలో చిరస్మణీయులుగా వేమన నిలిచారని ధృతి సంస్థ అధ్యక్షుడు కళ్ళం హరినాథ్‌రెడ్డి, వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు సంయుక్తంగా తెలిపారు. వేమన జయంతి సందర్భంగా శుక్రవారం రామానుజకూటమి యాత్రి నివాస్‌లో ధృతి సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సంస్థ ఆధ్వర్యంలో వేమన సాహిత్యసభను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ యోగివేమన కవిత్వంలో సామాజిక చైతన్యం తీసుకొచ్చిన గొప్ప విప్లవకారుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్త సుందరరావు, బాబునాగేంద్ర, నారాయణభట్టు, భవనం బద్రిరెడ్డి, డాక్టర్ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ బొడ్డు సుబ్బారెడ్డి, ఎం.అక్కిరెడ్డి, కత్తుల రమేష్, జాలి రామిరెడ్డి, ఆడిటర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న క్రిస్టాఫర్

● చుండూరు, జనవరి 19 : శతాబ్దాల క్రితమే సామాజిక రుగ్మతలపై వెలుగెత్తి చాటిన వ్యక్తి ప్రజాకవి యోగివేమన అని ఆంధ్ర లయోల కళాశాల ప్రొఫెసర్ మొవ్వా శ్రీనివాసరెడ్డి అన్నారు. వేమన సాహిత్య వికాస భవనంలో శుక్రవారం మోదుకూరు వేమన జయంతి ఉత్సవ కమిటీ, విజయవాడ ఆంధ్ర లయోల కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన జయంతి ఉత్సవాల్లో ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలను మేల్కొల్పడానికి, సామాజిక రుగ్మతులను తొలగించడానికి రాసిన కవిత్వం వేమనదేనన్నారు. వేమన ఆనాటి రోజుల్లో అలతి పదాలతో సాహితీ సంపదను సృష్టించారు. ఆ సాహితీ విలువలను నేటితరం కాపాడుకోవాలని ఆయన కోరారు. తొలుత వేమన జయంతి ఉత్సవాల చరిత్ర పుస్తకాన్ని నిర్వాహకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సాహితీ ప్రముఖులు మహేష్, సీతారామిరెడ్డి, మొవ్వా సాంబిరెడ్డి వేమన సాహిత్య విశిష్టత గురించి ప్రసంగించారు.

ఉపాధ్యాయుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలి : యూటీఎఫ్

బాపట్ల, జనవరి 19 : ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రశాఖ పిలుపు మేరకు శుక్రవారం బాపట్లలో యూటీఎఫ్ శాఖ ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు జె.వినయ్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల వేతనాలు ప్రతినెల 1వ తేదిన చెల్లించాలన్నారు. రాష్ట్రప్రభుత్వం, ఆర్థికశాఖాధికారులు వెంటనే పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు, కోశాధికారి ఎం.వెంకటేశ్వరరెడ్డి, జిల్లా కార్యదర్శి వి.చక్రధర్, ప్రధాన కార్యదర్శి దొంతిబోయన నన్నూరయ్య, మండల శాఖ నాయకులు ఎంఎస్ ప్రసాద్‌బాబు, బివి.శ్రీనివాసరావు, వైవీ నారాయణ, ఏసురాజు, యాజలి భాస్కరరావు, బాపూజీరెడ్డి, శ్యాంప్రభాకర్, డేవిడ్,రవిబాబు, రవికాంత్, పోలీసురావు, రాఘవేంద్ర, అజయ్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



బాపట్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న యూటీఎఫ్ శాఖ ఉపాధ్యాయులు

పదో రోజుకు చేరిన న్యాయవాదుల రిలే నిరాహార దీక్షలు

బాపట్ల, జనవరి 19 : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూహక్కుల చట్టం తక్షణమే రద్దు చేయాలని కోరుతూ న్యాయవాదులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 10వ రోజుకు చేరుకున్నాయి. బాపట్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న దీక్షలో ఊసా కృష్ణ, ఎం.మధు, ఇమ్మడిశెట్టి యలమంద, డి.బాలకోటేశ్వరరావు, బుర్లె అరుణ్, టి.మారుతిరావు కూర్చొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భీమా లీలాకృష్ణ మాట్లాడుతూ ఏపీ భూ హక్కుల చట్టం పేద, సామాన్య ప్రజలకు గొడ్డలిపెట్టు అన్నారు. ప్రజలందరూ ఈ చట్టంపై అవగాహన పెంచుకొని రద్దు చేసే వరకు పోరాటం చేస్తామన్నారు. న్యాయవాదులు డి.ఫిలిప్, నాగలక్ష్మి, నాగమోహిని, నాగప్రసాద్, వీరశేఖర్, ఇమ్మడిశెట్టి బాలకృష్ణ, రామాంజనేయులు, ఉషారాణి, నాగమోహిని, దివ్య, నాగలక్ష్మి పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధన కోసం కృషి

● ఎమ్మెల్యే కోన రఘుపతి



కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల, జనవరి 19 : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆశయ సాధన కోసం వైసీపీ ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. సామాజిక సమతా సంకల్పం వేడుకలకు బాపట్ల నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ఎమ్మెల్యే కోన భారీ ర్యాలీగా తరలి వెళ్ళారు. నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల నుంచి వచ్చిన నాయకులతో పురవీధులలో ప్రదర్శన నిర్వహించి ప్రత్యేక వాహనాలలో విజయవాడ తరలివెళ్ళారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కోన మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రపంచ దేశాలు సైతం భారత్ వైపు చూచేవిధంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, కోకి రాఘవరెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు వడ్డిముక్కల డేవిడ్, ఎంపీపీ చినపోతుల హరిబాబు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ గవిని కృష్ణమూర్తి, చింతల రాజశేఖర్, ఇనగలూరి మాల్యాద్రి, షేక్ సయాద్‌పీర్, గేరా మణిభూషణ్, కటికల యోహోషువా, మరియదాసు, జోగి రాజా, శేఖర్, చందు, నన్నం వెంకటేశ్వర్లు, రంగారావు, కొత్రా లక్ష్మీ నారాయణ, నక్కా వీరారెడ్డి, నర్రావుల వెంకట్రావు పాల్గొన్నారు.

● కర్లపాలెం, జనవరి 19 : విజయవాడలో ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ఎమ్మెల్యే కోన రఘుపతి ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీగా తరలి వెళుతూ కర్లపాలెం ఐలెండ్ సెంటర్‌లో ఎంపిపి యారం వనజ, మండల వైసీపీ కన్వీనర్ యల్లావుల ఏడుకొండలు కర్లపాలెంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పరమానందకుమార్, ఆట్ల నాగేశ్వరరెడ్డి, మనోహర్, బాబురావు, ఆమోష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలతో ప్రభుత్వం చర్చలు జరపాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి మజుందార్



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ మజుందార్

బాపట్ల, జనవరి 19 : రాష్ట్రంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ గత 39 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవటం దారుణమని వెంటనే చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సి.హెచ్ మజుందార్ డిమాండ్ చేశారు. శుక్రవారం బాపట్ల అంబేద్కర్ సర్కిల్‌లో సత్యాగ్రహం చేస్తున్న అంగన్‌వాడీలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విజయవాడలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించటం సంతోషదాయకమని అదే సందర్భంలో అత్యధికశాతం ఎస్‌సి, ఎస్టీ, బీసీ, మైనార్టీలు పనిచేస్తున్న అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోవటంతో సరికాదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి జె.శామ్యూల్, శరత్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు వెలగా శైలశ్రీ, శ్రీలత, భారతి, పద్మ, సీతామహలక్ష్మీ, గీత తదితరులు పాల్గొన్నారు.



కొల్లూరులో అంగన్‌వాడీ సమ్మె శిబిరం వద్ద పోలీసులు

● కొల్లూరు, జనవరి 19 : విజయవాడ ధర్నా చౌక్‌కు వెళ్లకుండా అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీసులు అడ్డుకుని నిర్బంధించారు. శుక్రవారం కొల్లూరు నుంచి విజయవాడ ధర్నా చౌక్‌లో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు మద్దతు పలికి సంఘీభావం తెలిపేందుకు వాహనంలో బయలుదేరి వెళుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలను ఎస్ఐ రాజ్యలక్ష్మి అడ్డగించి వాహనాన్ని నిలుపుదల చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విజయవాడలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరవుతున్నారని, మీరు వెళ్లేందుకు అనుమతులు లేవంటూ అప్పటికే సీఐటీయూ నాయకులు సుబ్బారావుతో పాటు సంఘ నాయకులకు ఈ విషయాన్ని గురువారమే తెలియజేయడం జరిగిందని కార్యకర్తలకు వివరించారు. సమ్మె శిబిరంలోనే ఉండాలని ఎటూ వెళ్లకూడదని ఆంక్షలు పెట్టి శిబిరం వద్ద పోలీసులు కాపలాగా ఉంచారు. మరో వాహనంలో కొంతమంది కార్యకర్తలు విజయవాడ ధర్నా చౌక్‌లో కొనసాగుతున్న సమ్మె శిబిరానికి చేరుకుని తమ మద్దతు, సంఘీభావం తెలిపారు.

● వేమూరు, జనవరి 19 : వేమూరులో తమ సమస్యల పరిష్కారం కోసంగా అంగన్‌వాడీలు ప్రారంభించిన నిరవధిక సమ్మె శుక్రవారం నాటికి 39వ రోజుకు చేరుకుంది. 17 గ్రామాల పరిధిలోని అంగన్‌వాడీలు సమ్మెలో పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం నుండి వైఖరిని విడనాడాలని అంటూ నినాదాలు చేశారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు.



అంబేద్కర్ ఫొటోకు నివాళులర్పిస్తున్న అంగన్‌వాడీలు

● రేపల్లె, జనవరి 19 : అంబేద్కర్ విగ్రహావిష్కరణ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగంలో కార్మికుల హక్కులను కాపాడాలని, అంగన్‌వాడీల సమస్యలను పరిష్కారం చేస్తేనే అంబేద్కర్ ఆశయాలు నెరవేరుతాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ మణిలాల్ అన్నారు. శుక్రవారం అంగన్‌వాడీలు సీఐటీయూ ఆధ్వర్యంలో చేస్తున్న సమ్మె 39వ రోజుకు చేరింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొండిగా ఉంటూ టెర్మినేషన్ నోటీసులను సిద్ధం చేయాలని కొత్త నోటిఫికేషన్ కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని అంగన్‌వాడీలను భయభ్రాంతులకు గురి చేయటం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.కృష్ణకుమారి, రజని, నాగమణి, జయప్రద, శారద పాల్గొన్నారు.

● భట్టిప్రోలు, జనవరి 19 : అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద జరుగుతున్న అంగన్‌వాడీల సమ్మె శుక్రవారం 39వ రోజుకు చేరుకుంది. శిబిరం వద్ద నుంచి స్థానిక పంచాయతీ వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేసి తమ నిరసనను తెలిపారు. యూనియన్ మండల నాయకులు రమాదేవి, సూర్యలక్ష్మీ, గృహలక్ష్మీలు మాట్లాడుతూ 39 రోజుల నుండి సమ్మె చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం సమస్యలు పరిష్కారం చేయకుండా షోకాజ్ నోటీసులు ఇచ్చి ఉద్యోగాల నుండి తొలగిస్తామని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఇటువంటి బెదిరింపులకు అంగన్‌వాడీలు భయపడరన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పి.మనోజ్‌కుమార్, వర్కర్లు, హెల్పర్లు రత్నకుమారి, చెల్లమ్మ, వాణి, రజిత తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్యసురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ ఎస్.విజయమ్మ

ఆరోగ్యసురక్షతో మెరుగైన వైద్యం : డీఎంహెచ్‌వో

బాపట్ల, జనవరి 19 : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యసేవలందించటమే ప్రభుత్వ లక్ష్యమని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ అన్నారు. జగనన్న ఆరోగ్యసురక్ష రెండో విడత కార్యక్రమం బాపట్ల మండలం స్టూవర్టుపురంలో శుక్రవారం ప్రారంభించారు. శిబిరాన్ని సందర్శించిన డీఎం అండ్ హెచ్‌వో వైద్యసిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరికి సంబంధించిన డేటా ఆరోగ్య సురక్షలో నమోదు చేయాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారికి మెరుగైన వైద్యం అందించేందుకు అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పులి శరత్‌బాబు, వెదుళ్ళపల్లి వైద్యాధికారిణి మానసా ప్రియదర్శిణి, వైష్ణవి కృష్ణ, శ్రీనివాసరావు, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాలకు ఆర్థికసాయం అందజేత

బాపట్ల, జనవరి 19 : మిచౌంగ్‌తుఫాన్ నేపథ్యంలో గాలులకు ఇళ్ళ కప్పు లేచిపోయి, ఇళ్ళలోకి నీరు చేరి ఇబ్బందులు పడ్డ నిరుపేద కుటుంబాల వారికి దళిత బహుజన రీసోర్స్ సెంటర్ వారు శుక్రవారం ఆర్థికసాయం అందజేశారు. బాపట్లలోని మాదాల నారాయణస్వామి కాలనీతోపాటు రాజీవ్‌గాంధీకాలనీలో ఎంపిక చేసిన 125 కుటుంబాల వారికి రూ.4 వేల చొప్పున నగదును బ్యాంక్‌ఖాతాలలో జమ చేసినట్లు రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అల్లాడి దేవకుమార్ తెలిపారు. బాధిత కుటుంబాలతో ఏర్పాటు చేసిన సమావేశానికి బాపట్ల పట్టణ కోఆర్డినేటర్ ఎస్.శ్రీలత అధ్యక్షత వహించగా ప్రోగ్రామ్ మేనేజర్ సి.హెచ్ అనీల్‌కుమార్ మాట్లాడుతూ పేద ప్రజలు మరింత ఇబ్బందులకు గురైన వారిని తుఫాన్ సమయంలో సురక్షిత ప్రాంతాలకు తరలించటంలో తమ సభ్యులు ఎంతగానో సహకరించారన్నారు. కార్యక్రమంలో రీజనల్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలోని చీరాల, బాపట్ల ప్రాంతాలలో 350 కుటుంబాలకు నగదు బదిలీ చేయటం జరుగుతుందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో పని చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన క్రిస్టియన్ ఎయిడ్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీపెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

అయోధ్య రాముని అక్షింతల పంపిణీ

కర్లపాలెం, జనవరి 19 : అయోధ్యలో ఈనెల 22వ తేదిన శ్రీరాముని విగ్రహం ప్రతిష్ఠించనున్నందున అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ఎం.వి.రాజుపాలెంలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో గ్రామపెద్దల ఆధ్వర్యంలో శుక్రవారం పూజా కార్యక్రమాలను కన్నుల పండువగా నిర్వహించారు. రాముని అక్షింతలను గ్రామంలోని ప్రజలకు పంపిణీ చేశారు. శ్రీ సీతారాములవారిపటం, అక్షింతలు, శ్రీరాములవారి జెండాలతో గ్రామంలోని పురవీధులలో జై శ్రీరామ్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేస్తూ పురవీధులలో ప్రదర్శన చేశారు.

ఈ కార్యక్రమంలో ఎం.వి.రాజుపాలెం శ్రీకోదండరామస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఆట్ల హరిబాబురెడ్డి, పిట్టు శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, ఏడుకొండలురెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితర మహిళలు పాల్గొన్నారు.

పెన్షన్‌దారులకు దుప్పట్లు...

పిట్టలవానిపాలెం, జనవరి 19 : మండలంలోని పిట్టువారిపాలెం, పోతనకట్టవారిపాలెం గ్రామపంచాయతీలలో పెన్షన్‌దారులకు బాపట్ల కోన చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోన రఘుపతి తనయుడు కోన నిఖిల్, వైసీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, మండల, గ్రామ ప్రజాప్రతినిధులు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు ఏట్రి అశ్విని శ్రీనివాసరెడ్డి, పార్వతి, ఉప ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు, వైసీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేడు మూడు దేవస్థానాల హుండీల లెక్కింపు

పిట్టలవానిపాలెం, జనవరి 19 : మండల పరిధిలోని చందోలు గ్రామంలో ఉన్న ప్రముఖ దేవస్థానములకు చెందిన శ్రీబగళాముఖి అమ్మవారు, శ్రీలింగోద్భవస్వామి, శ్రీచెన్నకేశవస్వామివార్లకు భక్తులు సమర్పించిన హుండీల లెక్కింపును శనివారం ఉదయం గుంటూరు దేవదాయశాఖ ఉప కమిషనర్ ఆదేశాల మేరకు బాపట్ల జిల్లా దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో ఈ హుండీల లెక్కింపు జరుగుతుందని మూడు దేవస్థానాల ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. పొన్నూరుకు చెందిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ వారి సిబ్బంది ఆధ్వర్యంలో ఈ లెక్కింపు జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు ఈలెక్కింపు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

ఆటలెక్కడ...అన్నీ కొట్లాటలే...!

● వీధి పోరాటాలను తలపిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు

● పర్యవేక్షణ, మౌలిక వసతుల మాటే లేదు

● అంతా మొక్కుబడి తంతు తప్ప చిత్తశుద్ధి కరువు

బాపట్ల జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గొప్పగా చెప్పుకున్న ఆడుదాం ఆంధ్ర పోటీలలో ఆటలెక్కడ కనబడడం లేదుగానీ క్రీడాకారుల మధ్య కొట్లాటలు మాత్రం యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇటీవల భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో నిర్వహించిన కబడ్డీ పోటీలలో పాయింట్ల విషయంలో తలెత్తిన వివాదంతో ఇరు జట్ల క్రీడాకారులు కొట్టుకోబోయారు. అది మరువకముందే శుక్రవారం పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెం గ్రామంలోని జూనియర్ కళాశాల క్రీడాప్రాంగణంలో జరిగిన క్రికెట్ పోటీలలో కూడా అదే సీన్ రిపీట్ అయింది. చందోలు--1 సచివాలయం టీంకు, ఖాజీపాలెం టీంకు మధ్య మ్యాచ్ జరగ్గా చందోలు టీం విజయం సాధించింది. విజయోత్సవాలలో భాగంగా ఒకరినొకరు కవ్వించుకోవడంతో ఘర్షణ పడ్డారు. బయట వ్యక్తులు కూడా రంగప్రవేశం చేయడంతో ఘర్షణ తారస్థాయికి చేరింది. దీంతో వివాదం చందోలు పోలీస్ స్టేషన్‌కు చేరింది. ఘర్షణకు కారకులపై పోలీసులు ఫిర్యాదు స్వీకరించారు. ఆటల పోటీల సంగతేమో కానీ క్రీడల పేరిట గొడవ పడుతుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



అధికారులను హడలెత్తిస్తున్న పాములు



ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో పాము

బాపట్ల, జనవరి 19 : ప్రభుత్వ కార్యాలయాలలో పాముల సంచారం కలకలం రేపుతున్నాయి. ఇటీవల కలెక్టరేట్‌లోని అనేక కార్యాలయాలలోకి పాములు వచ్చాయి. ప్రస్తుతం బాపట్ల ఐసీడీఎస్ కార్యా లయ ప్రాంగణంలో, ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో పాముల సం చారం కనిపిస్తున్నది. రెండురోజులుగా కనిపిస్తున్న పాములను చూచి అధికారులు హడలెత్తిపోతున్నారు. నాలుగురోజుల క్రితం పామును గు ర్తించి చంపారు. మరలా శుక్రవారం పాము కనిపించింది. ఇంకా ఎన్ని పాములు ఉన్నాయోనని అధికారులు, ప్రజలు భయపడుతున్నారు.

వెదుళ్ళపల్లి, స్టూవర్టుపురంలో సెబ్ అధికారుల దాడులు

బాపట్ల, జనవరి 19 : సెబ్ అధికారులు శుక్రవారం వెదుళ్ళపల్లి, స్టూవర్టుపురం గ్రామాలలో దాడి చేశారు. వెదుళ్ళపల్లి ఆటోస్టాండ్ వద్ద అక్రమ మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించి కోట చెన్నకేశవరెడ్డిపై కేసు నమోదు చేసి అతని వద్ద ఉన్న 10 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా స్టూవర్టుపురం నాల్గోవ గ్యాంగ్ కుందేరు వాగు సమీపంలో నాటుసారా తయారు చేస్తున్నట్లు గుర్తించి 550 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ ఎస్.శ్రీనివాసులు తెలిపారు. దాడులు నిర్వహించిన వారిలో ఎస్సై ప్రభుదాసు పాల్గొన్నారు.

కర్లపాలెంలో కులగణన ప్రారంభం

కర్లపాలెం, జనవరి 19 : కర్లపాలెం మండలంలో కులగణనను ప్రారంభించామని తహసీల్దార్ కేశవ నారాయణ తెలిపారు. కర్లపాలెం సచివాలయ పరిధిలో కులగణనను తహసీల్దార్ పరిశీలించి సిబ్బందికి పలుసూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మోడి శ్రీనివాసరావు, మహిళా పోలీసు వసుంధర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

కర్లపాలెం, జనవరి 19 : కర్లపాలెంలోని అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఫౌండేషన్ అధ్యక్షుడు, కర్లపాలెం ఉపసర్పంచ్ పఠాన్ అహ్మద్ బాషా అన్నారు. కర్లపాలెంలోని వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వలి, ఈసుబు, షేక్ ఇబ్రహిం, షేక్ హబీబ్, షేక్ జిలానీ, షేక్ బాదూర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అనగాని శివప్రసాద్, టీడీపీ నాయకులు

ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా పేద విద్యార్థులకు చేయూత

రేపల్లె, జనవరి 19 : ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా ఎంతోమంది పేద విద్యార్థులకు చేయూతనిస్తూ అనారోగ్యంతో బాధపడేవారికి అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు ప్రజలకు అందించటం శుభపరిణామమని ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు నూతన క్యాలెండర్ డైరీలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటివారికి సహాయపడాలనే సద్గుణంతో ఎన్టీఆర్ ట్రస్టును ఏర్పాటు చేయటం జరిగిందని, ట్రస్టు ద్వారా లక్షలాది మందికి చేయూతనివ్వటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ధరణికుమార్, తేజ్‌కుమార్, నాగమల్లేశ్వరరావు, గుర్రం మురహరిరావు, ఆగస్త్య పృధ్వీ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీగా ఆలూరి నారాయణ



నారాయణకు నియామక పత్రాన్ని అందిస్తున్న గంటా అంజిబాబు

రేపల్లె, జనవరి 19 : రానున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రేపల్లె నియోజకవర్గానికి చెందిన ఆలూరి నారాయణను కాంగ్రెస్ పార్టీ బాపట్ల జిల్లా కమిటీలో జనరల్ సెక్రటరీగా నియమించటం జరిగిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబు ప్రకటన ద్వారా తెలియజేశారు. ఆలూరి నారాయణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవిని కట్టబెట్టిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, గంటా అంజిబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జనరల్ సెక్రటరీగా ఎన్నికైన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు స్వామినారాయణమూర్తి, సత్యనారాయణ, అశోక్‌లు అభినందనలు తెలిపారు.

చేనేత కార్మిక సంఘం మహాసభలను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాలాజీ తదితరులు

భట్టిప్రోలు, జనవరి 19 : ఏపీ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరగనున్న కార్మిక సంఘం రాష్ట్ర 13వ మహాసభలను విజయవంతం చేయాలని సంఘ రాష్ట్ర కమిటీ సభ్యులు గొట్టుముక్కల బాలాజీ పిలుపునిచ్చారు. స్థానిక రైలుపేట చేనేత సొసైటీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 20, 21 తేదీలలో గుంటూరు జిల్లా మంగళగిరిలోని మార్కండేయ పద్మశాలీయ కల్యాణమండపంలో రాష్ట్ర మహాసభలు జరుగనున్నాయన్నారు. పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల కారణంగా రోజురోజుకు చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కొడాలి రామకోటేశ్వరరావు, నందం జగన్మోహనరావు పాల్గొన్నారు.

కోడికత్తి శ్రీనుకు న్యాయం చేయాలి : కనపర్తి



మాట్లాడుతున్న టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సుందరరావు

భట్టిప్రోలు, జనవరి 19 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి రాజారెడ్డి రాజ్యాంగాన్ని సీఎం జగన్మోనరెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్నాడని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి సుందరరావు అన్నారు. దళితులపై దమనకాండ ఆపండి - కోడికత్తి శ్రీనుకు న్యాయం చేయాలంటూ నియోజకవర్గ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో మండలంలోని పెదలంక గ్రామంలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి దుర్మార్గం కారణంగా కోడికత్తి శ్రీను నేటికి జైలులో మగ్గుతున్నాడని, న్యాయం కోరుతూ కోడికత్తి శ్రీను అమ్మ, సోదరుడు విజయవాడలో నిరాహారదీక్ష చేపట్టారని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి కనగాల మధుసూదనప్రసాద్, మండల కన్వీనర్ వాకా శేషుబాబు, నాయకులు మేరుగ సునీల్, మేరుగ వెంకటేశ్వరరావు, నిమ్మగడ్డ అబ్రహం, గుమ్మడి ఇస్రాయేలు, యడ్ల జయశీలరావు, బట్టు మల్లికార్జునరావు, మోటూరు పుణ్యశ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● అమృతలూరు, జనవరి 19 : కోడి కత్తి శ్రీనుకు వెంటనే బెయిల్ ఇవ్వాలని వేమూరు నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి పాములపాటి సుబ్బారావు కోరారు. శుక్రవారం మండల పరిధిలోని ఇంటూరులో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ కోడి కత్తి శ్రీనుకు బెయిల్ రాకుండా ప్రభుత్వం అనేక సాకులు చూపుతుందన్నారు. సుమారు 4 సంవత్సరాల పైబడి జైలులోనే కోడి కత్తి శ్రీను మగ్గుతున్నాడని ఆవేదన వ్యక్త పరిచారు. కోడి కత్తి శ్రీను కేసును సీబీఐకి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బోరుగడ్డ శ్యామ్యేలు, బోరుగడ్డ ఆనంద్, క్రొత్తపల్లి మాథ్యూస్, ఎలిచర్ల నాగరాజు, శెట్టి శ్రీను, కారుమంచి అర్జున్, వెంకటయ్య, లాజర్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ చేస్తున్న వ్యక్తికి అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదా

కొల్లూరు, జనవరి 19 : కృష్ణా యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్న కోయ హనుమంతరావు యూజీసీ నెట్ పరీక్షలో ఉత్తీర్ణుడై అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదాకు అర్హత సాధించాడు. మండల పరిధిలోని ఆవులవారిపాలెం గ్రామానికి చెందిన హనుమంతరావు 2023 డిసెంబరులో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన యూజీసీ నెట్ పరీక్షలో ఉత్తీర్ణుడై ఈ అర్హత సాధించాడు. గతంలో బాపట్లలోని ఓ కళాశాలలో లెక్చరర్‌గా పని చేసి ప్రస్తుతం బందరులో కృష్ణా యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్నాడు.

జాతీయ స్కాలర్‌షిప్‌కు ఐదుగురు విద్యార్థుల ఎంపిక

అమృతలూరు, జనవరి 19 : జాతీయ స్కాలర్‌షిప్‌కు ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం నిరీక్షణరావు శుక్రవారం తెలిపారు. నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు పాఠశాల నుంచి 20 మంది విద్యార్థులు హాజరుకాగా ఐదుగురు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించారు. వీరికి 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు నాలుగు సంవత్సరాల పాటు సంవత్సరానికి ఒక్కొక్కరికి రూ.12 వేల నగదును కేంద్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఇంటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏ దీపిక కూడా అర్హత సాధించింది.

ఏఎంఈ కామన్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్



ఏవియేషన్ కోర్సుల్లో ప్రవేశానికి ఉద్దేశించిన 'ఏఎంఈ కామన్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (ఏఎంఈ సీఈఈ)2024' నోటిఫికేషన్ వెలువడింది. ఇది జాతీయ స్థాయి పరీక్ష. ఇందులో అర్హత పొందిన అభ్యర్థులకు లైసెన్స్ ప్రోగ్రామ్‌లు, నాలుగేళ్ల ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లు, మూడేళ్ల గ్రాడ్యుయేషన్ ప్రోగ్రామ్‌లు, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. ఈ ప్రోగ్రామ్‌లకు వరసగా డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ), ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ), యూజీసీ, స్కిల్ ఇండియా గుర్తింపులు ఉన్నాయి. అడ్మిషన్ పొందిన అభ్యర్థులందరికీ నిబంధనల ప్రకారం స్కాలర్‌షిప్‌లు అందిస్తారు.

ప్రోగ్రామ్‌ల వివరాలు

- **లైసెన్స్ ప్రోగ్రామ్‌లు:** ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్(డీజీసీఏ/ఈఏఎస్ఏ), కమర్షియల్ పైలెట్ లైసెన్స్
- **ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లు:** ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్, ఏరోనాటికల్ ఇంజనీరింగ్, ఏరోస్పేస్ ఇంజనీరింగ్
- **గ్రాడ్యుయేషన్ ప్రోగ్రామ్‌లు:** బీబీఏ(ఏవియేషన్), బీఎస్సీ(ఏఎంఈ)
- **సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు:** క్యాబిన్ క్రూ, ఎయిర్‌పోర్ట్ మేనేజ్‌మెంట్, ఎయిర్‌పోర్ట్ గ్రౌండ్ స్టాఫ్

అర్హత: లైసెన్స్ ప్రోగ్రామ్‌లు, ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లకు గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు లేదా మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.

- గ్రాడ్యుయేషన్ ప్రోగ్రామ్‌లలో బీబీఏ(ఏవియేషన్)కు ఆర్ట్స్/కామర్స్/సైన్స్ గ్రూప్‌తో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీ(ఏఎంఈ) ప్రోగ్రామ్‌నకు సైన్స్ గ్రూప్‌తో ఇంటర్/పన్నెండోతరగతి పూర్తిచేసి ఉండాలి.
- సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లకు ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణత చాలు.
- ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు అడ్మిషన్ నాటికి 16 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.

ఏఎంఈ సీఈఈ 2024 వివరాలు: దీనిని ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. పరీక్ష సమయం గంట. ఇంటర్/తత్సమాన అర్హత ఉన్న అభ్యర్థులకు మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 25 ప్రశ్నలు ఇస్తారు. డిప్లొమా పూర్తిచేసినవారికి జనరల్ అవేరెనెస్, ఇంగ్లీష్, ఆప్టిట్యూడ్ నుంచి ఒక్కోదానిలో 25 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు నాలుగు మార్కులు చొప్పున మొత్తం మార్కులు 300. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. ప్రశ్నపత్రాన్ని ఇంగ్లీష్, హిందీ మాధ్యమాల్లో ఇస్తారు. ఎగ్జామ్ సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

స్కాలర్‌షిప్ వివరాలు: ఏఎంఈ సీఈఈ 2024 ఎగ్జామ్‌లో మొదటి మూడు ర్యాంక్‌లు సాధించిన వారికి, సెంట్రల్/స్టేట్ బోర్డు ఎగ్జామ్ (ఇంటర్ స్థాయి పరీక్ష)లో టాపర్స్‌గా నిలిచిన పదిమందికి స్కాలర్‌షిప్ కింద మొదటి సెమిస్టర్ ట్యూషన్ ఫీజు చెల్లిస్తారు. ఏఎంఈ సీఈఈ 2024 ఎగ్జామ్‌లో 4 నుంచి 15 ర్యాంక్‌ల మధ్య సాధించిన 12 మందికి 75 శాతం; 16 నుంచి 50 మధ్య ర్యాంక్‌లు సాధించిన 35 మందికి 50 శాతం; 51 నుంచి 200 మధ్య ర్యాంక్‌లు సాధించిన 150 మందికి 25 శాతం; 201 నుంచి 1,000 మధ్య ర్యాంక్‌లు సాధించిన 800 మందికి 20 శాతం; 1001 నుంచి 5,000 మధ్య ర్యాంక్‌లు సాధించిన 4,000 మందికి 15 శాతం; ఏఎంఈ సీఈఈ 2024లో అర్హత సాధించిన అభ్యర్థులందరికీ 10 శాతం చొప్పున మొదటి సెమిస్టర్ ట్యూషన్ ఫీజు చెల్లిస్తారు.

ఉద్యోగావకాశాలు: ఏఎంఈ ప్రోగ్రామ్‌లు పూర్తి చేసిన అభ్యర్థులు ఏరోనాటికల్ అండ్ ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఎయిర్‌పోర్ట్ అండ్ ఎయిర్‌లైన్ మేనేజ్‌మెంట్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్, క్యాబిన్ క్రూ, ఏవియేషన్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, ఏవియేషన్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్ విభాగాల్లో ఉద్యోగావకాశాలు పొందవచ్చు. ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీర్లు, ఏవియేషన్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్లు, ఎయిర్‌క్రాఫ్ట్ డిస్పాచర్, ఏవియేషన్ సెక్యూరిటీగా పనిచేయవచ్చు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **వెబ్‌సైట్:** www.amecee.in

దిక్సూచి DIKSUCHI

ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీలో

పీజీ, పీహెచ్‌డీ

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ(ఏపీఎఫ్‌యూ) - 2023-24 అకడమిక్ ఇయర్‌కు సంబంధించి మాస్టర్ ఆఫ్ ఫిషరీ సైన్స్(ఎంఎఫ్ఎస్సీ), పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. నెల్లూరు జిల్లా ముత్తుకూరులోని కాలేజ్ ఆఫ్ ఫిషరీ సైన్సెస్‌లో అడ్మిషన్స్ ఇస్తారు.

సీట్ల వివరాలు: ఎంఎఫ్ఎస్సీ ప్రోగ్రామ్‌లో ఆక్వాకల్చర్ 3, ఆక్వాటిక్ యానిమల్ హెల్త్ మేనేజ్‌మెంట్ 2, ఫిషరీస్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ 4, ఆక్వాటిక్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ 2, ఫిష్ ప్రాసెసింగ్ టెక్నాలజీ 3, ఫిషరీస్ ఇంజనీరింగ్ 2 సీట్లు చొప్పున మొత్తం 16 సీట్లు ఉన్నాయి. పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ఆక్వాకల్చర్ 2 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: ఎంఎఫ్ఎస్సీలో ప్రవేశానికి ఐకార్ గుర్తింపు పొందిన కళాశాల నుంచి నాలుగేళ్ల బీఎఫ్ఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. దరఖాస్తు నాటికి అభ్యర్థుల వయసు 40 ఏళ్లు మించకూడదు. పీహెచ్‌డీలో ప్రవేశానికి ఎంఎఫ్ఎస్సీ పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థుల వయసు 50 ఏళ్లు మించకూడదు. రెండు ప్రోగ్రామ్‌లకు జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్ అర్హత తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 20
- **చిరునామా:** రిజిస్ట్రార్, ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ, అయిదో అంతస్తు, విశాల్ రెసిడెన్సీ, పద్మజ నగర్, తాడిగడప, విజయవాడ-521134
- **వెబ్‌సైట్:** www.apfu.ap.gov.in

బుక్ మై షోకు ఫిర్యాదు చేశాం



నాగవంశీ

'కొంతమంది కావాలనే బుక్ మైషోలో నకిలీ రివ్యూలు ఇచ్చి, 'గుంటూరు కారం' సినిమాను దెబ్బతీయాలని చూశారు. దానిపై ఆ సంస్థకు ఫిర్యాదు చేశాం. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. 'గుంటూరు కారం' విజయాన్ని అడ్డుకోవాలని కొందరు మొదటి రోజు నుంచే 'సినిమా బాగోలేద'ని సోషల్ మీడియాలో అవాస్తవాలను ప్రచారం చేశారు. కానీ వారి ప్రయత్నాలు ఫలించలేదని చెప్పడానికి మా సినిమాకు వస్తున్న వసూళ్లే నిదర్శనం. ఆ విషయం చెప్పడానికే మీడియా ముందుకొచ్చాను' అని నిర్మాత నాగవంశీ అన్నారు. మహేశ్‌బాబు కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వం వహించిన చిత్రమిది. తొలి వారాంతానికే రూ. 200 కోట్ల వసూళ్లను సాధించి బాక్సాఫీసు దగ్గర నిలకడగా కొనసాగుతోందని. నాగవంశీ మీడియాతో ఆనందం వెలిబుచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

- మహేశ్‌బాబు మొదట్నుంచి ఈ సినిమా విజయంపై నమ్మకంతో ఉన్నారు. నెగెటివ్ రివ్యూలు వచ్చినా ఆయన ఆందోళన చెందలేదు. 'రేపటి నుంచి 'గుంటూరు కారం' వసూళ్లు ఎలా ఉంటాయో చూడండి' అన్నారు. ఆయన అంచనాలే నిజమయ్యాయి. మహేశ్ ధైర్యమే ఈ స్థాయి వసూళ్లకు కారణమైందనుకుంటున్నాను.
- 'గుంటూరుకారం' సినిమా కొంత మంది మీడియా వాళ్లకు లక్ష్యంగా మారింది. డిస్ట్రిబ్యూటర్లకు, థియేటర్లకు ఫోన్ చేసి మరీ వసూళ్ల గురించి ఆరా తీస్తున్నారు. వాళ్లు ఎన్ని విధాలా ప్రయత్నించినా, నెగెటివ్ రివ్యూలు ఇచ్చినా సినిమా ఫలితాన్ని దెబ్బతీయలేకపోయారు. రిలీజైన తొలి రోజే సోషల్ మీడియా ద్వారా సినిమా బాగోలేదనే ప్రచారాన్ని మొదలుపెట్టారు. కానీ సినిమా బాగుండడంతో ప్రేక్షకులు వాటన్నింటినీ పక్కనపెట్టి అఖండ విజయాన్ని అందించారు. కుటుంబ ప్రేక్షకులకు మా సినిమా బాగా నచ్చడం వల్లే ఈ స్థాయి వసూళ్లు వస్తున్నాయి. గతంలో మా బేనర్‌లో వచ్చిన చిత్రాలకు నెగెటివ్ రివ్యూ వచ్చినప్పుడు వసూళ్లు పడిపోయాయి. కానీ ఈ సారి మాత్రం వాటితో సంబంధం లేకుండా 'గుంటూరు కారం' భారీ వసూళ్ల దిశగా సాగుతోంది. కొందరు కావాలనే మా సినిమాను టార్గెట్ చేశారనే అభిప్రాయం ఉంది.
- దీనిని ఫ్యామిలీ సినిమాగా ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లి ఉండాల్సింది. ఇది త్రివిక్రమ్ శైలిలో ఉండే ఫ్యామిలీ సినిమా అని ప్రేక్షకులకు ముందే తెలియజెప్పలేకపోయాం. దీనివల్ల 'గుంటూరు కారం' పక్కా మాస్ ఫిల్మ్ అని అభిమానులు అనుకున్నారు. అందువల్ల మొదట్లో కొంత నిరాశ చెందినా సర్దుకున్నారు.



బాధపెట్టాం... క్షమించండి

నయనతార

నయనతార 'అన్నపూరణి' వివాదం ఇంకా సద్దుమణగలేదు. కథ రిత్యా ఇందులోని కొన్ని సన్నివేశాలు మత విశ్వాసాలను భంగపరిచేలా వున్నాయంటూ పలువురు అభ్యంతరాలు వెలిబుచ్చిన విషయం తెలిసిందే. ఈ విషయంపై నయన్‌తో సహా చిత్ర బృందంపై మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్, ముంబయ్‌ల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి . దీంతో చిత్ర నిర్మాణ సంస్థ జీ స్టూడియోస్ ఈ సినిమాను ఓటీటీ స్ట్రీమింగ్ నుంచి తొలగించడంతోపాటు వివరణ కూడా ఇచ్చుకుంది. ఇదిలావుంటే.. రీసెంట్‌గా 'అన్నపూరణి' వ్యవహారంపై నయనతార భావోద్వేగపూరితంగా సోషల్ మీడియా ద్వారా ఓ లేఖను విడుదల చేశారు. 'బరువెక్కిన హృదయంతో ఈ లెటర్‌ను రాస్తున్నాను. నిజానికి 'అన్నపూరణి' మంచి ప్రయత్నం. ఓ మంచి ఆలోచన ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉద్దేశ్యంతో ఈ సినిమా చేశాం. సంకల్పం గట్టిదైతే ఏదైనా సాధించవచ్చు అనే మంచి విషయాన్ని ఈ సినిమా ద్వారా చర్చించాం. కానీ ఈ ప్రయత్నంలో తెలీకుండానే కొందరి మనసుల్ని బాధపెట్టాం. ఇది ఉద్దేశ్యపూర్వకంగా జరిగింది కాదు. మనోభావాలు దెబ్బతీయడం మా అభిమతం కాదు. నా 20 ఏళ్ల కెరీర్‌లో ఎవరినీ బాధపెట్టలేదు. సానుకూలంగానే ముందుకెళ్లాను. సెన్సార్ సర్టిఫికెట్ ఇచ్చిన సినిమాను ఓటీటీ నుంచి తొలిగిస్తారని అనుకోలేదు. తెలిసో తెలియకో కొందరిని బాధపెట్టాం. క్షమించమని మనస్ఫూర్తిగా వేడుకుంటున్నాం' అంటూ సోషల్ మీడియా ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు నయనతార. ఇక 'అన్నపూరణి' కథ విషయానికొస్తే.. 'అగ్నిహోత్రం లాంటి సంప్రదాయ కుటుంబంలో పుట్టిన ఓ అమ్మాయి, చెఫ్ కావాలనే తన కోరికను ఎలా సాకారం చేసుకుంది? అనే ప్రశ్నకు సమాధానంగా ఈ సినిమా రూపొందింది. నయనతార టైటిల్‌రోల్ పోషించిన ఈ చిత్రంలో సత్యరాజ్, జై కీలక పాత్రలు పోషించారు. నీలేశ్ కృష్ణ దర్శకుడు.

ఫిల్మ్ ఛాంబర్ మాట నిలబెట్టుకోవాలి

పీపుల్ మీడియా ఫ్యాక్టరీ

సంక్రాంతి సినిమా వార్ ముగిసింది అనుకునేలోపే రాబోతున్న ఫిబ్రవరి వార్‌కి సంబంధించిన సెగలు అప్పుడే మొదలయ్యాయి. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ వారు ఫిల్మ్‌ఛాంబర్‌కి రాసిన లేఖ.. వార్ మొదలవ్వకముందే వాతావరణం వేడెక్కేలా చేసిందని చెప్పాలి. నిజానికి పీపుల్‌మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన రవితేజ 'ఈగల్' సినిమా సంక్రాంతికి విడుదలకావాల్సింది. కానీ అప్పటికే నాలుగు సినిమాలు పోటీలో ఉండటం, తద్వారా తలెత్తే థియేటర్ల కొరత.. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని 'ఈగల్'ని ఫిబ్రవరికి వాయిదా వేసుకోవలసిందిగా ఛాంబర్ కోరింది. ఫిబ్రవరిలో సోలో డేట్ వచ్చేలా చూస్తామని ఫిల్మ్‌ఛాంబర్ మాటివ్వడంతో.. పీపుల్‌మీడియా సంస్థ 'ఈగల్'ని ఫిబ్రవరి 9కి వాయిదా వేసింది. ఇదిలావుంటే.. ఇప్పుడు అదే తేదీకి రజనీకాంత్ 'లాల్ సలామ్', సందీప్‌కిషన్ 'ఊరి పేరు భైరవకోన' చిత్రాలు విడుదల కానున్నాయి. ఈ విషయాన్ని సదరు చిత్రాల నిర్మాతలు ప్రకటించారు కూడా. ఈ నేపథ్యంలో 'సోలో డేట్ ఇస్తాం' అని మాటిచ్చిన ఛాంబర్, తన మాటను నిలబెట్టుకోవాలని, తమకు సోలో డేట్ వచ్చేలా సహకరించాలని కోరుతూ ఫిల్మ్‌ఛాంబర్‌కి పీపుల్ మీడియా ఫ్యాక్టరీ లేఖ రాసింది. మరి ఈ విషయంపై ఛాంబర్ ఏ విధంగా స్పందిస్తుందో చూడాలి. ఇక 'ఈగల్' విషయానికొస్తే రవితేజ కథానాయకుడిగా రూపొందిన ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకుడు. అనుపమా పరమేశ్వరన్, కావ్య థాపర్ కథానాయికలు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/TbmSwCB లో చదవండి.

జాబ్ కార్నర్

డా.వైఎస్ఆర్ హెల్త్ వర్సిటీలో జూనియర్ అసిస్టెంట్స్

విజయవాడలోని డాక్టర్ వైఎస్ఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్... డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 20

అర్హత: బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి

ఎంపిక ప్రక్రియ: ప్రిలిమినరీ ఎగ్జామ్, మెయిన్ ఎగ్జామ్, కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికులు, దివ్యాంగులకు రూ.750. ఇతరులకు రూ.1500.

ఫీజు చెల్లింపునకు చివరి తేదీ: జనవరి 31

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 1

వెబ్‌సైట్: drysruhs.edu.in/

ఏపీ జ్యుడీషియల్ సర్వీస్‌లో జడ్జి పోస్టులు

ఏపీ స్టేట్ జ్యుడీషియల్ సర్వీస్‌లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్/ట్రాన్స్‌ఫర్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అమరావతిలోని ఏపీ స్టేట్ హైకోర్ట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

పోస్టు: సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్)

ఖాళీలు: 39(32 డైరెక్ట్ రిక్రూట్‌మెంట్; 7 ట్రాన్స్‌ఫర్ ద్వారా భర్తీ చేస్తారు)

అర్హత: లా లో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: జనవరి 31 **చివరి తేదీ:** మార్చి 1

వెబ్‌సైట్: https://aphc.gov.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/HQ81KRrలో చదవండి.

ఎన్‌పీటీఐలో పీజీ డిప్లొమా

హరియాణాలోని నేషనల్ పవర్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్‌పీటీఐ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా 2024 వింటర్ సెషన్ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో రెండు సెమిస్టర్లు ఉంటాయి. పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్, రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ గ్రిడ్ ఇంటర్ఫేస్ టెక్నాలజీస్ అనే స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా పలు మాడ్యూల్స్, ఇండస్ట్రియల్/ఫీల్డ్ ట్రెయినింగ్, ప్రాజెక్ట్ వర్క్‌లు పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్ చివర్లో ఫైనల్ ఎగ్జామ్ నిర్వహిస్తారు. మొత్తం 360 సీట్లు ఉన్నాయి. వీటిలో 25 శాతం సీట్లను పవర్ సంస్థలు స్పాన్సర్ చేసిన అభ్యర్థులకు ప్రత్యేకించారు.

పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్: ఈ స్పెషలైజేషన్‌లో గ్యాస్, సోలార్, విండ్, బయోమాస్ తదితర పవర్ ప్లాంట్‌లకు సంబంధించిన ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ అంశాలు వివరిస్తారు. పవర్ సెక్టార్ విభాగాల నిర్వహణకు అవసరమైన శిక్షణ ఇస్తారు. ఫరీదాబాద్, నాగ్‌పూర్, నైవేలీ, శివపురి క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 60 చొప్పున మొత్తం 240 సీట్లు ఉన్నాయి.

రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ గ్రిడ్ ఇంటర్ఫేస్ టెక్నాలజీస్: ఈ స్పెషలైజేషన్‌లో రెన్యూవబుల్ ఎనర్జీ సోర్సెస్‌కు సంబంధించిన టెక్నాలజీ, ఎకనామిక్స్, పాలసీ, ఎనర్జీ సిస్టమ్స్, సప్లయ్ తదితర అంశాలు ఉంటాయి. సోలార్ ఎనర్జీ సిస్టమ్స్, ఫొటోవోల్టాయిక్ సిస్టమ్స్, థర్మల్ ఎనర్జీ సిస్టమ్స్, విండ్ ఎనర్జీ, బయోమాస్, జియోథర్మల్, టైడల్ అండ్ వేవ్ ఎనర్జీ, హైడ్రోజన్ అండ్ ఫ్యూయెల్ సెల్స్ గ్రిడ్ ఇంటిగ్రేషన్, ఇంటర్ఫేసింగ్ టెక్నాలజీస్ అంశాలు వివరిస్తారు. న్యూఢిల్లీ, బెంగళూరు క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 60 చొప్పున మొత్తం 120 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో(బీఈ/బీటెక్/తత్సమాన కోర్సు)(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/సీ అండ్ ఐ/పవర్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులైన అభ్యర్థులు రెండు స్పెషలైజేషన్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చు. రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ గ్రిడ్ ఇంటర్ఫేస్ టెక్నాలజీస్ స్పెషలైజేషన్‌కు(బీఈ/ బీటెక్)(కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఐటీ) అభ్యర్థులు కూడా అర్హులే. వయోపరిమితి నిబంధనలు లేవు.

- **కోర్సు ఫీజు:** నాన్ స్పాన్సర్డ్ అభ్యర్థులకు రూ.2,30,000; స్పాన్సర్డ్ అభ్యర్థులకు రూ.3,60,000. అదనంగా 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 22
- **వెబ్‌సైట్:** npti.gov.in

అదీ నా అదృష్టం



వీకే నరేశ్

నటుడిగా 50 ఏళ్ల సినీ ప్రయాణాన్ని పూర్తి చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నాను అని వీకే నరేశ్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో ప్రత్యేకంగా ముచ్చటిస్తూ. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం వల్లే నటుడిగా సుదీర్ఘ కెరీర్ సాధ్యమైందని చెప్పారు. జీవితాంతం పరిశ్రమకు సేవ చేస్తానని పేర్కొన్నారు. ఊహ తెలిసినప్పటి నుంచి సినిమాల మధ్యనే పెరగడం వల్ల ఇదే తన జీవితం కావాలని కోరుకున్నానని చెప్పారు. తొమ్మిదో ఏట 'పండంటి కాపురం' లాంటి చిత్రంతో బాలనటుడిగా అరంగేట్రం చేయడం, ఎన్టీఆర్ లాంటి గొప్ప నటులతో కలసి పనిచేయడం తన జీవితంలో మర్చిపోలేని అనుభవం అని తెలిపారు. ఒక్క సినిమాలో హీరోగా నటించినా చాలు అనుకున్న తనకు ప్రేక్షకులు ఇంత సుదీర్ఘ సినీ కెరీర్‌ను ఇచ్చారని, వారికి రుణపడి ఉంటానని అన్నారు. నంది పురస్కారాలను అందించకపోవడంపై నరేశ్ స్పందిస్తూ 'నంది పురస్కారాలను చిత్ర పరిశ్రమలో చాలా గౌరవంగా, ఒక గుర్తింపుగా భావిస్తారు. కానీ ఇప్పుడు ఆ పురస్కారాలను ప్రభుత్వాలు అందజేయకపోవడం చాలా బాధాకరం. దీనివల్ల ఒక తరం నటీనటులకు అసలు నంది పురస్కారాలు అంటే తెలిసే అవకాశం కూడా లేకుండా పోతుంది. నంది పురస్కారాలు ఇచ్చే సంప్రదాయాన్ని ప్రభుత్వాలు మళ్లీ పునరుద్ధరించాలి' అని కోరారు. 'సేవాభావంతోనే నేను రాజకీయాల్లోకి వెళ్లాను, కానీ అక్కడ మారిన పరిస్థితుల్లో ఇమడలేక బయటకు వచ్చాను, మళ్లీ ఆ వైపు వెళ్లే ఆలోచన ప్రస్తుతానికైతే లేదు' అని నరేశ్ తెలిపారు. రాజమౌళి, మహేశ్‌బాబు కాంబినేషన్‌లో రూపొందే సినిమా తెలుగు పరిశ్రమ ఖ్యాతిని మరో స్థాయికి తీసుకెళుతుందని చెప్పారు. నటుడిగా తనని తాను కొత్త కోణంలో ఆవిష్కరించుకొనే పాత్రలు మరిన్ని వస్తున్నాయనీ, నెగెటివ్ రోల్స్ చేయాలనుందని ఆయన చెప్పారు.

అద్దంకి ప్రజలకు తాగునీటి కష్టాలు

- మరమ్మతులకు గురైన మోటార్
- మూడు రోజులుగా సరఫరా బంద్

అద్దంకి, జనవరి 19: అద్దంకి పట్టణంలో మంచినీటి సరఫరాలో తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతోంది. దీంతో పట్టణ ప్రజలకు నీటి కష్టాలు తప్పటం లేదు. పట్టణంలోని మార్కెట్‌యార్డులో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్ పరిధిలో ఉన్న కాలనీలకు మూడు రోజులుగా మంచినీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. గుండ్లకమ్మ నదిలోని ఊటబావుల వద్ద నుంచి రామ్‌నగర్ ట్యాంక్‌కు నీటిని పంపింగ్ చేసే మోటార్ మరమ్మతులకు గురికావటంతో సరఫరా నిలిచిపోయింది. గతంలో మరమ్మతులకు గురైన స్టాండ్‌బై మోటార్ ద్వారా నీటిని పంపింగ్ చేసేవారు. ప్రస్తుత పాలకవర్గం మంచినీటి సరఫరాపై పెద్దగా దృష్టి పెట్టకపోవటంతో తరచూ ఇబ్బందులు తప్పటంలేదు. స్టాండ్‌బై మోటార్ లేకపోవటం, మోటార్‌కు మరమ్మతులు చేయటం ఆలస్యం కావటంతో మూడు రోజులైనా ఇంకా మంచీనీటి సరఫరా పునరుద్ధరణ జరగలేదు. శనివారం అయినా నీటి సరఫరా జరుగుతుందో, లేదోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, పాలకవర్గం వెంటనే స్పందించి నీటి సరఫరాకు చర్యలు చేపట్టడంతో పాటు స్టాండ్‌బై మోటార్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

- తల్లిని పరామర్శించేందుకు వెళుతుండగా ఘటన

నూతలపాడు(పర్చూరు), జనవరి 19: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తల్లిని చూసేందుకు వెళుతూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం చెందాడు. ఈప్రమాదం శుక్రవారం పత్తిపాడు సమీపంలో చోటుచేసుకుంది. పర్చూరు మండలం నూతలపాడుకు చెందిన వెల్లటూరి వేణుబాబు(36) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ప్రస్తుతం వర్క్ ఫ్రం హోంలో భాగంగా ఇంటివద్దే ఉంటూ విధులు నిర్వహిస్తున్నాడు. తల్లి అనారోగ్యం బారిన పడటంతో గుంటూరులోని ఓప్రయివేట్ వైద్యశాలలో చికిత్స చేయిస్తున్నారు.

ఈనేపథ్యంలో శుక్రవారం వైద్యశాలలో ఉన్న తల్లిని పరామర్శించేందుకు అదేగ్రామానికి చెందిన ఎర్రం గణేష్‌రెడ్డితో కలసి ద్విచక్రవాహనంపై గుంటూరు వెళుతున్నాడు. ఈక్రమంలో పత్తిపాడు సమీపంలో ఆర్‌టీసీ బస్సును ఓవర్‌టేక్ చేస్తున్న తరుణంలో ఎదురుగా వస్తున్న ఓప్రయివేట్ స్కూల్ బస్సును ఢీ కొట్టడంతో వేణుబాబు అ క్కడికక్కడే మృతి చెందాడు. గణేష్‌రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగ్రాతుడిని గుంటూరులోని ఓప్రయివేట్ వైద్యశాలకు తరలించారు. మృతుడికి రెండేళ్ల క్రితం వివాహమైంది. ఏడునెలల బాబు, భార్య ఉన్నారు.

మృతుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగంతో పాటు, గ్రామంలోని కోటయ్య దేవస్థానంలో అర్చకుడిగా పనిచేస్తూ అందరితో కలివిగా ఉండేవారు. దేవునికి నైవేద్యం సమర్పించి తల్లిని పరామర్శించేందుకు వెళుతూ మృత్యువాత పడటంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

మెరుగైన వైద్యసేవలకు కేరాఫ్ శ్రీదత్త సూపర్‌స్పెషాలిటీ హాస్పటల్



శ్రీదత్త సూపర్‌స్పెషాలిటీ హాస్పటల్‌ను ప్రారంభిస్తున్న పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, మాచర్ల టీడీపీ ఇన్‌చార్జ్ జూలకంటి బ్రహ్మారెడ్డి, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు

వినుకొండ, జనవరి 19: పట్టణంలోని ఏనుగుపాలెం రోడ్డులో గల డైమండ్ టవర్స్ సమీపంలో నూతనంగా ఏర్పాటుచేసిన శ్రీదత్త సూపర్‌స్పెషాలిటీ 4వ బ్రాంచి హాస్పటల్‌ను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు, పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుతో పాటు మాచర్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి, అడిషనల్ ఎస్పీ రాఘవేంద్ర చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైద్యులు గార్లపాటి కృష్ణకాంత్ మాట్లాడుతూ శ్రీదత్త సూపర్‌స్పెషాలిటీ హాస్పటల్‌లో పల్నాడు, ప్రకాశం జిల్లా వాసులకు అతి తక్కువ ఖర్చుతో అన్నిరకాల వైద్యసేవలు అత్యాధునిక వైద్యపరికరాల ద్వారా అందించడం జరుగుతుందన్నారు. అన్నివేళల్లో అత్యవసర సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. జర్నలిస్టులకు కూడా హెల్త్ కార్డుపై చికిత్స అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపార వేత్తలు కపిలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, వివిధ వైద్యశాలలకు చెందిన వైద్యులు, పట్టణ పురప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల లైఫ్ సర్టిఫికెట్ల నమోదు

చినగంజాం, జనవరి 19: స్థానిక భూ సమేత భావనారాయణస్వామి కల్యాణ మండపంలో మండల పరిధిలోని రిటైర్డ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు జీవన ప్రమాణ పత్రాల(లైఫ్‌సర్టిఫికెట్) నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. రిటైర్డ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఏడుగుండ్ల నాగేశ్వరరావు, గంటా వెంకటస్వామిల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారులు, ఫ్యామిలీ పెన్షన్‌దారులకు రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా నాయకులు రిటైర్డ్ పశుసంవర్థకశాఖ జాయింట్ డైరెక్టర్ టి.వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఇరిగేషన్ శాఖ ఉద్యోగి బి.వెంకటేశ్వర్లు ఆన్‌లైన్‌లో జీవన ప్రమాణ పత్రాలను నమోదు చేశారు. 2024వ సంవత్సరానికి సంబంధించిన జీవన్ ప్రమాణ పత్రాలను పెన్షన్‌దారులు తమ వేలిముద్రలు, ఐరిస్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో ప్రభుత్వానికి సమర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సభ్యులు అక్కల రామకృష్ణారెడ్డి, పల్లపోలు ప్రభాకర్ విఠల్‌రావు, సైకం వెంకటేశ్వర్లు, సాంబశివరావు, ఎన్.సాయిబాబు, పెన్షన్‌దారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలివెళ్లిన నాయకులు

మార్టూరు, జనవరి 19: విజయవాడలో శుక్రవారం జరిగిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు మండలం నుంచి తరలివెళ్లారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతో పాటు ఇతర సామాజిక వర్గాలకు చెందిన ప్రజానీకం, నేతలు తరలి వెళ్లారు. మండలంలో ప్రజానీకం తరలివెళ్లడానికి ఆరు ఆర్‌టీసీ బస్సులను కేటాయించారు. వీటిల్లో స్థానిక నేతలు గర్నెపూడి రవి చందు, బాణావతు బాబూ నాయక్, అట్టూరి సుకుందరావు, షైలా నాగేశ్వరరావు, గొట్టిపాటి ఆనంద్, ఉలాస గాంధీ, రాజా నాయక్, గడ్డం మస్తానవలి, పఠాన్ కాలేషావలి, తదితరులు వెళ్లారు.

అదేవిధంగా యద్దనపూడి మండలం నుంచి ఆరు ఆర్‌టీసీ బస్సులలో నాయకులు, ప్రజలు విజయవాడకు తరలి వెళ్లారు.



'నాగులపాడు' చుట్టూ వైసీపీ రాజకీయం

- రెండు వర్గాలుగా విడిపోయిన అద్దంకి పట్టణ నేతలు
- కృష్ణచైతన్య వర్గానికి చెక్ పెట్టే దిశగా పావులు కదుపుతున్న హనిమిరెడ్డి
- ఐదారు సొసైటీలకు పాత కమిటీలను మార్పుచేసి కొత్త పేర్లతో ప్రతిపాదనలు

అద్దంకి, జనవరి 19: వైసీపీ అద్దంకి పట్టణ రాజకీయం నాగులపాడు సొసైటీ చుట్టూ తిరుగుతోంది. ప్రస్తుత పాలకవర్గాన్ని కొనసాగించాలని ఒక వర్గం, కొత్త పేర్లతో ప్రతిపాదనలు పంపాలని మరో వర్గం పట్టుబట్టింది. దీంతో అద్దంకి పట్టణ వైసీపీ రెండు వర్గాలుగా విడిపోయింది. ఒక వర్గానికి వైసీపీ పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, వర్గానికి ప్రస్తుత నాగులపాడు సొసైటీ త్రీమెన్ కమిటీ చైర్‌పర్సన్ సందిరెడ్డి భారతి భర్త, పీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ సందిరెడ్డి రమేష్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సందిరెడ్డి రమేష్‌తో పాటు కొంతమంది అద్దంకి పట్టణ వైసీపీ నేతలు ఇంకా కృష్ణచైతన్య అనుచరులు గానే కొనసాగుతూ హనిమిరెడ్డికి సంఘీభావం తెలపలేదు.

ఈనేపథ్యంలో నాగులపాడు సొసైటీ త్రిమెన్ కమిటీ పాలకవర్గం జనవరి 31వ తేదితో ముగియనుండగా, ఫిబ్రవరి 1వ తేది నుంచి మరలా నియామకం చేయాల్సి ఉంది. దీంతో సందిరెడ్డి రమేష్ వద్దకు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాణెం హనిమిరెడ్డి పలుమార్లు కాకాని రాధాకృష్ణమూర్తి ద్వారా రాయబారం పంపినట్లు తెలుస్తుంది. దీనిపై స్పందించలేదన్న ఉద్దేశంతో నాగులపాడు సొసైటీకి కొత్తగా మానికొండ నాగరాజు, జార్లపాలెం రాఘవరెడ్డి, తిమ్మాయపాలెం వెంకటేశ్వర్లు (సిద్దయ్య)లతో త్రిమెన్ కమిటీకి ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న సందిరెడ్డి రమేష్ గురువారం రాత్రి అద్దంకి పట్టణంలో తనకు సంఘీభావంగా పలువురు కౌన్సిలర్‌లు, వైసీపీ నేతలను కూడకట్టుకొని బొల్లాపల్లి టోల్‌గేట్ వద్ద ఓ హోటల్‌లో హనిమిరెడ్డిని కలిశారు. పాత కమిటీలో ఉన్న సందిరెడ్డి భారతి, మలిపెద్ద రాంబాబు, యరమోతు సింగయ్య లను కొనసాగించాలని కోరినట్లు తెలుస్తుంది. దీంతో పాత పాలకవర్గాన్ని కొనసాగించాలని ఒక వర్గం, కొత్త పేర్లతో కమిటీ వేయాలని మరో వర్గం పట్టుబడుతుంది. పట్టణంలోని వైసీపీ నేతలు రెండు వర్గాలుగా విడిపోయి పావులు కదుపుతున్నారు. వీరిలో ఎవరికి ఇచ్చినా రెండో వర్గం కినుక వహించి వైసీపీకి దూరమయ్యే పరిస్థితులు ఉంటాయన్న అభిప్రాయం పలువురు వ్యక్తం చేస్తున్నారు.

ఇదేక్రమంలో అద్దంకి నియోజకవర్గంలో ఇంకా చైతన్య వర్గంగా కొనసాగుతున్న రావినూతల, గోవాడ, జె.పంగులూరు, చందలూరుతో పాటు మరికొన్ని సొసైటీలకు కొత్త పేర్లతో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తుంది. కృష్ణచైతన్య వర్గానికి చెక్ పెట్టే దిశగా హనిమిరెడ్డి పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఈనేపథ్యంలో ఆయా సొసైటీల పరిధిలోని గ్రామాలలో పెద్ద ఎత్తున రాజకీయ సమీకరణలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఏమిజరిగినా ఆయా గ్రామాలలో ఒక వర్గం వైసీపీకి దూరమయ్యే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

దళితులపై దమనకాండ ఆపాలి

- అంబేడ్కర్ విగ్రహం వద్ద టీడీపీ ఎస్సీ సెల్ నిరసన



సీఎంకు బుద్ధి ప్రసాదించమని అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

పర్చూరు, జనవరి 19: దళితులపై సీఎం జగన్మోహన్‌రెడ్డి దమనకాండ ఆపాలని, కోడికత్తి శ్రీనుకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పర్చూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద టీడీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా బాపట్ల పార్లమెంట్ ఎస్సీసెల్ అధ్యక్షుడు బేతపూడి సురష్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి తమ్ములూరి అశోక్, టీడీపీ సీనియర్ నాయకుడు నూతలపాటి ఇజ్రాయిల్ మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో దళితులపై ఆరువేలకు పైగా దాడులు జరిగాయని, 188 మంది దళితుల్ని హత్యచేశారన్నారు. దళితులకు రాజ్యాంగబద్ధంగా అమలుకావాల్సిన 27 సంక్షేమ పథకాలను రద్దు చేసి ఏ మొహం పెట్టుకుని విగ్రహావిష్కరణ చేస్తారని ప్రశ్నించారు. నాలుగు లక్షల మందికి టీడీపీ హయాంలో ఉపాధి కల్పించిన ఎస్సీ కార్పోరేషన్‌ను నిర్వీర్యం చేశారని అన్నారు. దళిత బిడ్డలు విదేశాల్లో విద్యనభ్యసించేందుకు తీసుకొచ్చిన అంబేడ్కర్ విదేశ విద్యాపథకాన్ని నాలుగేళ్ల పాటు అటకెక్కించారన్నారు. అంబేడ్కర్ పేరు తొలగించి జగన్ రెడ్డి విదేశ విద్యగా మార్చి అంబేడ్కర్‌ను అవమానపరిచారని మండిపడ్డారు. కార్యక్రమంలో కట్టెంపూడి డేవిడ్, పల్లపాటి స్టేటస్, కందా వంశీ, సాంబయ్య, శ్రీహరి, చిట్టినేని రామకృష్ణ, కొండ్రగుంటి శివనాగేశ్వరరావు, కొల్లా చంద్రం, షేక్ గౌస్, షేక్.మాబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.



పర్చూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న టీడీపీ ఎస్సీ సెల్ నేతలు

శ్రీనుకు న్యాయం జరగాలి

చీరాల, జనవరి 19: కోడి కత్తి కేసులో నిందితుడు శ్రీనుకు న్యాయం జరగాలని టీడీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం స్థానిక కారంచేడు గేటు సెంటర్‌లోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి విజ్ఞాపన పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నిందితుడు శ్రీనుకు సుమారు ఐదు సంవత్సరాల నుంచి కనీసం బెయిల్ కూడా లేకుండా జైలులో మగ్గటం వెనుక సీఎం జగన్ కుట్ర ఉందని ఆరోపించారు. శ్రీను కుటుంబసభ్యులు ప్రస్తుతం తమ బిడ్డ కోసం దీక్షకు దిగారని, అందుకు ప్రతిఒక్కరూ సంఘీభావం తెలపాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మద్దులూరి గౌరీఅమర్‌నాథ్, గుద్దంటి చంద్రమౌళి, నాశిక వీరభద్రయ్య, గజవల్లి శ్రీనివాసరావు, గంజి పురుషోత్తమ్, కౌతవరపు జనార్ధనరావు, నరాల తిరుపతిరాయుడు, దుడ్డు శామ్యూల్, తదితరులు పాల్గొన్నారు. కోడికత్తి కేసులో శ్రీనుకు న్యాయం జరిగేందుకు సీఎం జగన్ ఎన్ఐఏ కోర్టు విచారణకు హాజరై వాస్తవాలను వివరించి సాక్ష్యం చెప్పాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు గొర్రెపాటి రవికుమార్ శుక్రవారం డిమాండ్ చేశారు. శ్రీనుకు బెయిల్ రాకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటుందని ఆరోపించారు.

చెరువులకు చేరుతున్న సాగర్ జలాలు

- మార్టూరుకు నామమాత్రమే!



బొల్లాపల్లి జీఎన్‌టీ వద్ద సాగర్ కాలువలో తక్కువగా వస్తున్న నీరు

మార్టూరు, జనవరి 19: వేసవిలో తాగు నీటికి ఇబ్బంది లేకుండా గ్రామాలలోని మంచినీటి చెరువులను నింపడానికి విడుదల చేసిన సాగర్ జలాల ప్రవాహం అంతంత మాత్రంగానే ఉంది. నీటి ప్రవాహం చాలా తక్కువగా ఉండటంతో చెరువులకు అరకొరగా సాగర్ జలాలు చేరుతున్నాయి. శుక్రవారం బొల్లాపల్లి జీఎన్‌టీ వద్ద 220 క్యూసెక్కులు నీళ్ల వస్తున్నాయి. మండలంలోనే మేజరు పంచాయతీ మార్టూరు మంచినీటి చెరువుకు చాలా తక్కువ మోతాదులో నీళ్ల చేరుతున్నాయి. ప్రస్తుతం చెరువులో 30 శాతం మాత్రమే నీరు ఉంది. రాబోయే వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా విడుదలయిన సాగర్ జలాలుతో చెరువులను నింపాలని పంచాయతీ అధికారులు భావించారు. నాలుగు రోజుల క్రితం మన ప్రాంతానికి సాగర్ జలాలు వచ్చినప్పటికీ గురువారం మాత్రమే మార్టూరు చెరువుకు నీళ్ల చేరాయి. సాగర్ ప్రధాన కాలువ నుంచి రాజుపాలెం మేజరుకు 15 క్యూసెక్కులు మాత్రమే నీళ్ల వస్తున్నాయి. ఈమేజరులో 50 క్యూసెక్కులు వస్తేనే దిగువకు చేరతాయి.

రాజుపాలెం మేజరు కాలువ పక్కనే ఉన్న ద్వారకపాడు, ఇసుకదర్శి, నాగరాజుపల్లి, వలపర్ల గ్రామాల పరిధిలోని రైతుల పొలాలు నుంచి తప్పించుకొని మార్టూరు చెరువుకు నీళ్ల చేరడం కష్టతరంగా మారింది. ప్రస్తుతం ఈ కాలువ ప్రక్కనే రైతులు వేసిన మొక్క జొన్న పంట బెట్ట దశలో ఉంది. ఈనేపథ్యంలో మార్టూరు చెరువుకు నీళ్ల చేర్చడం అధికారులకు తలనొప్పిగా మారింది. దీనికితోడు ఈ నెల 22 వతేదీ నాటికి సాగర్ నీళ్ల రావడం నిలిచిపోతుందని అధికారులు చెబుతున్నారు. కనీసం పది రోజులు సమృద్ధి మార్టూరు చెరువుకు నీళ్ల చేరితేనే 70 శాతం నిండుతుంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో ఈ మోతాదులో చెరువుకు నీళ్ల చేరే పరిస్థితి కనిపించడం లేదు.

వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని పంచాయతీ ఈవో శ్రీనివాసరావు అంటున్నారు. మంచినీటి చెరువు వద్ద అదనంగా రెండు బోర్లను ఏర్పాటుచేస్తామని చెప్పారు. మండలంలోని వలపర్ల, ద్రోణాదుల, బొల్లాపల్లి, బొబ్బేపల్లి, తాటివారిపాలెం, తదితర గ్రామాలలోని చెరువులకు సాగర్ జలాలు చేరుతున్నాయి.

అంగన్‌వాడీలపై ప్రభుత్వం చిన్నచూపు

- కార్యకర్తల ధ్వజం
- 39వ రోజుకు చేరిన సమ్మె



అద్దంకిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద సత్యాగ్రహ దీక్ష చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు

అద్దంకిటౌన్, జనవరి 19: తమ సమస్యలపై అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు ధ్వజమెత్తారు. అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం నాటికి 39వ రోజుకు చేరుకుంది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ర్యాలీగా బంగ్లారోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వరకు చేరుకుని సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా తమ సమస్యలు పరిష్కార మయ్యేవరకు సమ్మెను విరమించబోమని అంగన్‌వాడీ కార్యకర్తలు చెప్పారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.తిరుతిరెడ్డి, బీఎస్పీ నాయకుడు మందా జోసఫ్ సంఘీభావం తెలిపారు.

మార్టూరు: అంగన్‌వాడీ కార్యకర్తలు శుక్రవారం మండల కాంప్లెక్స్ వద్ద దీక్షా శిబిరాన్ని కొనసాగించారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను పరిష్కరింతేవరకు సమ్మెను కొనసాగిస్తామని నినాదాలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు శ్యామల, రాణి, రాజేశ్వరి, అంజలి, రాజ్యం, లలిత, సుహాసిని, విజయ, తదితరులు పాల్గొన్నారు.

బల్లికురవ: ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారానికి 38వ రోజుకు చేరింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన కార్యకర్తలు, హెల్పర్లు సమ్మెలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సంఘ నేతలు నాగమణి, నిర్మల, సరస్వతి, అనురాధ, సత్యవతి, శ్రీదేవి పాల్గొ న్నారు.

చినగంజాం: చావో, రేవో తెల్చుకుంటామే తప్ప సమ్మెను విరమించేదిలేదని అంగన్‌వాడీ కార్యక ర్తలు హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారం 39వ రోజుకు చేరింది. ఉద్యమాన్ని ఉధృతం చేస్తామే తప్ప తగ్గేదే లేదని అన్నారు. కార్యక్రమంలో ఇంకొల్లు ప్రాజెక్టు అంగన్‌వాడీల సంఘం నాయకురాలు ఎ.హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

చీరాల: సీఎం జగన్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని అంగన్‌వాడీ కార్యకర్తలు ధ్వజమెత్తారు. శుక్రవారం పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలను విజయవాడ సభకు వెళ్లకుండా చీరాల వన్‌టౌన్, ఈపురుపాలెం పోలీస్‌స్టేషన్లకు తరలించి అనంతరం విడిచిపెట్టారు. ఈక్రమంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద 38వ రోజు సమ్మెలో భాగంగా దీక్ష కొనసాగించారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు ఎం.వసంతరావు, ఎన్.బాబూరావు, సుజీవన, సులోచన, సుప్రభ, అనిత, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎడ్ల బలప్రదర్శన పోటీలు



పోటీలో తలపడుతున్న ఎడ్లు

అన్నంబొట్లవారిపాలెం(పర్చూరు), జనవరి 19: పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెంలో జరుగుతున్న ఎడ్ల బలప్రదర్శనలో శుక్రవారం ఫైనల్ పోటీలు జరిగాయి. పెద్దసైజు ఎడ్ల ఫైనల్ పోటీలో తొలుత గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లికి చెందిన త్రినజ్జ రెడ్డి ఎడ్ల జత నిర్ణీత సమయం ముగిసేసరికి 3901.1 దూరం లాగాయి. తదుపరి బరిలోకి దిగిన హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన ఎస్ఎస్ బుల్స్ ఎడ్ల జత 3900 అడుగులు, గుంటూరు జిల్లా చుండూరు మండలం, వేటపాలెంకు చెందిన అర్కేబుల్స్ ఎడ్ల జత 3405 అడుగులు, గుంటూరు జిల్లా, పొన్నూరుకు చెందిన ఎడ్లు 2486 అడుగుల దూరం లాగాయి. ప్రస్తుత పోటీలో కృష్ణాజిల్లా ఒంగోలు జాతి ఎడ్లు ముందంజలో ఉన్నాయి. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు గోరంట్ల భాస్కర్‌రావు తెలిపారు.

కొరిశపాడు, మేదరమెట్ల ఎస్ఐలు బదిలీ

మేదరమెట్ల , జనవరి 19: సాధారణ ఎన్నికలు సమీపిస్తుండడంతో ఎస్ఐల బదిలీలు ప్రారంభం అయ్యాయి. శుక్రవారం మేదరమెట్ల, కొరిశపాడు ఎస్ఐలు నాగశివారెడ్డి, జీవీ చౌదరిలు సంవత్సరం కాంకుండానే బదిలీ అయ్యారు. మేదరమెట్ల స్టేషన్‌కు ఏ.చంద్రశేఖర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. మేదరమెట్ల ఎస్ఐ నాగశివారెడ్డిని బల్లికురవ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. కొరిశపాడు ఎస్ఐ జీవీ చౌదరిని వీఆర్‌కు పిలిచారు. కొరిశపాడు ఎస్ఐగా ఎవ్వరిని నియమించలేదు. కొత్తగా ఎస్ఐలు వచ్చేవరకు వీరే విధులలో కొనసాగుతారని తెలిసింది.

సంతమాగులూరు ఎస్ఐగా సురేష్

సంతమాగులూరు, జనవరి 19: సంతమాగులూరు ఎస్ఐగా పి.సురేష్ నియమితు లయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంవీ శివకుమార్ బాపట్ల జిల్లా పోలీసు కార్యాలయానికి (వీఆర్)కు వెళ్ళారు. అమర్తలూరు పోలీసుస్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న సురేష్ సంత మాగులూరుకు బదిలీ అయ్యారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బాపట్ల జిల్లాలో 15 మంది ఎస్ఐలకు స్థాన చలనం కలిగింది.

నేడు 1వ వార్డులో పర్యటించనున్న ఎమ్మెల్యే రవికుమార్

అద్దంకి, జనవరి 19: బాబు ష్యూరిటీ... భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం అద్దంకి పట్టణంలోని 1వ వార్డులో శనివారం సాయంత్రం 5 గంటలకు జరగనుంది. ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు.

న్యాయాధికారికి సన్మానం

అద్దంకి, జనవరి 19: అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జూనియర్ అసిస్టెంట్ కేటగిరిలో టైపిస్టుగా పనిచేస్తూ ఇటీవల జ్యుడిషియల్ మేజిస్ట్రేట్‌గా ఎంపికై ప్రొద్దుటూరు మేజిస్ట్రేట్‌గా నియమితులైన సురేంద్రరెడ్డిని శుక్రవారం స్థానిక కోర్టులో సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి బుజ్జప్ప, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను సద్వియోగం చేసుకోవాలి

చినగంజాం, జనవరి 19: ప్రభుత్వం అమలుచేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎస్.వేణుగోపాలకృష్ణమూర్తి అన్నారు. మండలంలోని కడవకుదురు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు కోట్ల కీర్తిసరోజ్, బి.నాగేంద్ర, గైనకాలాజిస్ట్ డాక్టర్ షణ్ముఖశ్రీ, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ జి.పృథ్వి 353 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా పలువురికి కళ్లజోళ్ళు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.శివకుమారి, గ్రామ కార్యదర్శి ఎస్.సూర్యనారాయణ, పొదలి రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

12వ పీఆర్సీని వెంటనే అమలుపరచాలి

ఇంకొల్లు, జనవరి 19: ప్రభుత్వ ఉద్యోగులకు 12వ పీఆర్సీని జూలై 1,2023 నుంచి ప్రభుత్వ ఉద్యోగులందరికీ అమలుచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పిడపర్తి పేరిరెడ్డి అన్నారు. వేతన సవరణ అమలులో జాప్యం జరిగితే కనీసం వెంటనే 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, ఇప్పటివరకు పెండింగులో ఉన్న డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఇంకొల్లు, జనవరి 19: ఇంకొల్లు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ జాగర్లమూడి రామకృష్ణ తెలిపారు. ఇంకొల్లు, గంగవరం, కొణికి, పావులూరు, గొల్లపాలెం, హనుమోజిపాలెం, ఇంకొల్లు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నార. వినియోగదారులు విద్యుత్ అంతరాయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్‌ను బదిలీ చేయాలి

అద్దంకిటౌన్, జనవరి 19: ఆర్టీసీ కార్మికులను వివిధరకాలుగా ఇబ్బందులు గురిచేస్తున్న ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్‌ను బదిలీ చేసేవరకు నిరసనలు కొనసాగిస్తామని ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రెసిడెంట్ చిరంజీవి డిమాండ్ చేశారు. శుక్రవారం అద్దంకి ఆర్టీసీ డిపో ఎదుట ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులతో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ అద్దంకి డిపో అసిస్టెంట్ మేనేజర్‌పై కార్మికులు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారన్నారు. సర్వీస్‌లకు వెళ్ళిన డ్రైవర్, కండెక్టర్‌లు తక్కువ కలెక్షన్‌లు తెస్తే నోటి కొచ్చినట్లు తిడుతున్నారన్నారు. ఆమెను బదిలి చేయకుంటే ఆదివారం నుంచి రిలే దీక్షలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిపో ప్రెసిడెంట్ అబ్దుల్ వహీద్, సుబ్బరామయ్య, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, గ్యారేజి సెక్రటరీ వివేక్, తదితరులు పాల్గొన్నారు.

కుల గణన సర్వే ప్రారంభం

బల్లికురవ, జనవరి 19: మండలంలోని అన్ని గ్రామాలలో కులగణన సర్వే శుక్రవారం ప్రారంభమైందని ఈవోపీఆర్డీ సుమతి తెలిపారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికి తిరిగి కులాల వారీగా ప్రజల వివరాలను సేకరిస్తున్నారు. సచివాలయ సిబ్బంది ప్రత్యేక యాప్‌లో కులగణన వివరాలను నమోదు చేయాలని ఈవోపీఆర్డీ ఆదేశించారు.

నీటి కుంట ఏర్పాటుకు స్థల పరిశీలన

బల్లికురవ, జనవరి 19: మండలంలోని ముక్తేశ్వరంలో అమృత్ సరోవర్‌లో నీటి కుంట ఏర్పాటుకు శుక్రవారం డ్వామా పీడీ అర్జునరావు, డీఎఫ్‌వో టీమయ్య స్థలపరిశీలన చేశారు. ముక్తేశ్వరం పరిధిలోని అటవీ భూమి సర్వే నెంబరు 153లో నీటి కుంట ఏర్పాటు చేసేందుకు అటవీ శాఖాధికారులు భూమిని కేటాయించారు. ఈ భూమిలో ఉపాధి హామీ పథకం ద్వారా నీటి కుంట ఏర్పాటుచేసేందుకు అధికారులు స్థలాన్ని పరిశీలించారు. ఈ పరిశీలనలో ఏపీడీ సువార్త, ఎంపీడీవో బ్రహ్మయ్య, మండల ప్రత్యేకాధికారి బాల సుబ్రమణ్యం, ఏపీవో బాలకృష్ణనాయక్, ఫారెస్టు బీట్ అఫీసర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేర నియంత్రణకు సహకరించాలి

చీరాలటౌన్, జనవరి 19: చీరాల పరిధిలో నేర నియంత్రణకు లాడ్జి, రిసార్ట్స్ నిర్వాహకులు సహకరించాలని డీఎస్పీ ప్రసాదరావు సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం డీఎస్పీ కార్యాలయంలో రిసార్ట్స్, లాడ్జి నిర్వాహకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రికార్డులు పక్కాగా ఉండాలన్నారు. సమావేశంలో ఎస్‌బీ సీఐ సూర్యనారాయణ, సీఐలు నిమ్మగడ్డ సత్యనారాయణ, శేషగిరిరావు, ఎస్ఐలు జనార్ధన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

మేదరమెట్ల , జనవరి 19: జాతీయ రహదారిలో విజయవాడవైపు వాహనాలు వెళ్లకుండా నిలుపుదల చేయడంతో వాహనదారులు ఇబ్బందులుపడ్డారు. శుక్రవారం విజయవాడలో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభ జరిగింది. శుక్రవారం ఉదయం 10 గంటల తరువాత వాహనాలను విజయవాడ వెళ్లకుండా నిలిపివేశారు. మేదరమెట్ల, కొరిశపాడు ఎస్ఐలు చెన్నై వైపు నుంచి వచ్చే వాహనాలను మేదరమెట్ల ఫ్లైఓవర్ వద్ద ఆపివేశారు. విశాఖపట్టణం, ఒడిస్సా, కోల్‌కత్తా వైపు వెళ్ళే వాహనాలు రోడ్డుపైనే నిలిపివేశారు. రాత్రి 8 గంటలకు వరకు కిలోమీటర్లు కొద్దీ వాహనాలు నిలిచిపోయాయి. 8 గంటల తరువాత వాహనాలను విజయవాడ వైపు అనుమతించారు. కూరగాయలు, పాలు వంటి అత్యవసర వాహనాలు వెళ్లడానికి వీలులేక నిలిచిపోయాయి. మేదరమెట్ల కొరిశపాడు ఎస్ఐలు జీవీ చౌదరి, నాగశివారెడ్డి ఫ్లైఓవర్ వద్ద ఉండి వాహనాలను నియంత్రించి విడతలవారీగా పంపించి వేశారు.

కళాకారులను ఆదుకోవాలి

అద్దంకిటౌన్, జనవరి 19: కళాకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కల్పించాల్సిన సౌకర్యాలు అందేలా కృషి చేయాలని ఎంపీ రఘురామకృష్ణమరాజును అద్దంకి కళాకారులు, బాపట్ల జిల్లా సాంస్కృతిక అధ్యక్షుడు గోవాడ శ్రీకాంత్ కోరారు. శుక్రవారం హైదరబాద్‌లోని ఎంపీ నివాసంలో ఆయనను కళాకారులు కలిశారు. వృద్ధ కళాకారులకు కేంద్రం ద్వారా వచ్చే పెన్షన్లు, ప్రతి నియోజకవర్గంలోని కళాకారుడికి గృహ వసతి, బస్సు చార్జీలలో రాయితీ, రంగస్థల నాట్య కళాకారుల గుర్తింపు కార్డులు, వివిధ సౌకర్యాలు అందించేలా చూడాలని ఎంపీని కోరారు. ఈసందర్భంగా ఎంపీ రఘురామకృష్ణమరాజు మాట్లాడుతూ కళాకారులకు కావల్సిన సౌకర్యాలపై రానున్న పార్లమెంట్‌లో సమావేశాల్లో మాట్లాడ తానని తెలిపారు. ఆయన్ను కలిసిన వారిలో టీడీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధికార ప్రతినిధి చెబ్రోలు వెంకటసుబ్బయ్య, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు జయబాబు తదితరులు ఉన్నారు.